సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 08.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 338
పేజీలు: 08 వెల: రూ. 5

## ఉద్యోగులకు దసరా కానుక

ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ పెంపుపై ప్రభుత్వం ఉత్తర్వులు

- అక్టోబర్ జీతంతో పెంచిన డీఏ చెల్లింపు
- నవంబర్ 1న ఖాతాల్లో జమ కానున్న పెరిగిన మొత్తం
- డీఏ బకాయిలను 33 వాయిదాల్లో చెల్లించనున్న ప్రభుత్వం
- జూలై, 2024 బకాయిలు 27 వాయిదాల్లో జీపీఎఫ్‌కు జమ



02

## వాస్తవాలను కప్పిపుచ్చలేరు

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్ రావుకు భట్టి విక్రమార్క ఘాటు కౌంటర్

- పవర్ సెక్టార్ ప్రైవేటీకరణ ఆలోచనే లేదు..
- బొగ్గు బ్లాకుల విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలకు ఆధారాలున్నాయి
- యాదాద్రి ఆలస్యానికి గత ప్రభుత్వ నిర్ణయాలే కారణం



02

## ఆర్బీఐ రెపో రేటు పెంపు

రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు పెంపు

- 5.25 శాతం నుంచి 5.50 శాతానికి పెరుగుదల
- రుణాలపై పెరగనున్న ఈఎంఐ భారం
- ఎఫ్‌డీ డిపాజిటర్లకు స్వల్పంగా పెరగనున్న వడ్డీ
- రియల్, ఆటో రంగాలపై ప్రతికూల ప్రభావం




02

# ఎర్రవల్లిలో 45 ఎకరాలు మాయం!

## రికార్డుల్లో 388 ఎకరాలు.. క్షేత్రస్థాయిలో 343 ఎకరాలే
## మిగిలిన భూమి ఆచూకీ కోసం ప్రత్యేక సర్వే

- కేసీఆర్ కుటుంబ భూముల రికార్డులపైనా అధికారుల దృష్టి
- అర్హులైన రైతులకు భూముల పంపిణీకి సీఎం ఆదేశం
- అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ.. ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాజకీయాల్లో మరో భూవ్యవహారం తెరపైకి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములపై ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూముల రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితిపై అధికారులు నిర్వహించిన ప్రాథమిక సర్వేలో ఏకంగా 45 ఎకరాల భూమి వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 325లో 388 ఎకరాల భూమి ఉన్నట్లు నమోదై ఉండగా.. తాజాగా అధికారులు నిర్వహించిన సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో రికార్డుల్లో నమోదైన 388 ఎకరాలకు, వాస్తవంగా గుర్తించిన 343 ఎకరాలకు మధ్య ఉన్న 45 ఎకరాల భూమి ఏమైందన్నది ఇప్పుడు అధికారుల ముందున్న ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 45 ఎకరాల భూమి ఆచూకీ తేల్చేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలో సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు.




**388 ఎకరాలు..**
**కనిపించింది 343 ఎకరాలే**
ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325 భూములపై జరిగిన పరిశీలనలో ఈ వ్యత్యాసం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ రికార్డుల్లో మొత్తం 388 ఎకరాలు ఉన్నట్లు నమోదు కాగా.. క్షేత్రస్థాయిలో చేపట్టిన తాజా సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడ ఉంది? రికార్డుల్లో ఉన్న భూమి క్షేత్రస్థాయిలో ఎందుకు కనిపించలేదు? భూముల హద్దులు మారాయా? రికార్డుల్లో ఏమైనా తప్పిదాలు చోటుచేసుకున్నాయా? లేక ఇతర మార్గాల్లో భూముల స్వరూపం మారిందా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగనుంది. ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే గ్రామాల వారీగా భూముల హద్దులను పరిశీలించడంతో పాటు పాత రికార్డులు, రెవెన్యూ దస్త్రాలు, ధరణి వివరాలు, ప్రస్తుత భూమి వినియోగం తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**కేసీఆర్ కుటుంబ భూములపై దృష్టి**
సర్వే నంబర్ 325కు సమీపంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూములు ఉన్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి భూములకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేసే అవకాశం ఉందా? అన్న చర్చ మొదలైంది. అయితే సర్వే, రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాతే తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నిర్వహించనున్న సమగ్ర సర్వేలో సర్వే నంబర్ 325తో పాటు దాని పరిసర ప్రాంతాల్లోని భూముల హద్దులు, యాజమాన్య వివరాలు, రికార్డుల్లో మిగతా 02లో

## కాంగ్రెస్ సైలెన్స్..
# వ్యూహం?
## రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్

ఆరోపణల హోరులో అధికార పార్టీ మౌనం వెనుక అసలు కథేంటి?

- కేటీఆర్, హరీశ్‌రావు వరుస ప్రెస్‌మీట్లు..
- రేవంత్ మాత్రం సైలెంట్‌గానే ఎందుకు?
- అగ్రనాయకత్వం కంటే సోషల్ మీడియా వింగ్‌పైనే బీఆర్ఎస్ ఆధారం.. ఇదే మైనస్‌గా మారుతోందా?



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావులను టార్గెట్ చేస్తూ భూకేటాయింపులు, ప్రాజెక్టుల వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. దీనికి కౌంటర్‌గా బీఆర్ఎస్ నేతలు సీఎం కుటుంబ ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై ఆరోపణలు చేస్తున్నా.. అవి అదే స్థాయిలో రాజకీయ ప్రకంపనలు సృష్టించలేకపోతున్నాయనే చర్చ మొదలైంది.

**రేవంత్‌దే డైరెక్ట్ అటాక్..**
సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మీడియా ముందుకొచ్చి బీఆర్ఎస్ అగ్రనేతల పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించడం కాంగ్రెస్ వ్యూహానికి ప్రధాన బలంగా మారిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీనికి భిన్నంగా బీఆర్ఎస్ మాత్రం సీఎం కుటుంబంపై చేస్తున్న ఆరోపణలను ప్రధానంగా పార్టీ సోషల్ మీడియా వింగ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. దీంతో ఆరోపణల తీవ్రత ఉన్నప్పటికీ, వాటికి రాజకీయ విశ్వసనీయత ఎంతవరకు వస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రెస్‌మీట్లతో బీఆర్ఎస్ రక్షణలోకి..**
రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలకు కేటీఆర్, హరీశ్‌రావులు సుదీర్ఘంగా వివరణలు ఇవ్వాల్సి వస్తోంది. వరుస ప్రెస్‌మీట్లు, మీడియా సమావేశాలతో తమపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నారు. మరోవైపు సీఎం మాత్రం ప్రతీ ఆరోపణకు వెంటనే స్పందించకుండా తన రాజకీయ ఎజెండాతో ముందుకు వెళ్తున్నారు. దీంతో దాడి చేస్తున్నది కాంగ్రెస్.. వివరణ ఇస్తున్నది బీఆర్ఎస్ అన్న భావన ప్రజల్లో ఏర్పడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

**'ఆధారాలు'పై ప్రశ్నలే ప్రశ్నలు..**
సీఎం కుటుంబ వ్యాపారాలు, ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ చేస్తున్న ఆరోపణల్లో అధికారిక పత్రాలు, స్పష్టమైన ఆధారాలు ప్రజల ముందుకు వస్తున్నాయా? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. మిగతా 02లో

## ఓట్, సీట్ చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

- పీసీసీలన్నీ పటేల్‌ను ప్రధాని చేయాలని ప్రతిపాదించాయి
- ఈసీ తప్పు చేస్తే కోర్టులో తేల్చుకోవాలని సూచన
- కేసీఆర్ భూవివాదంపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవడం లేదు



02

## విదేశీ వర్సిటీలకు ఏపీలో దారి

'తల్లికి వందనం' మార్గదర్శకాలకు కేబినెట్ ఆమోదం

- విదేశీ వర్సిటీలు, ప్రైవేట్ క్యాంపస్‌లకు నూతన పాలసీ
- రేపల్లె ఆసుపత్రి 100 పడకలకు అప్‌గ్రేడ్
- అభివృద్ధి పనులకు భూ కేటాయింపులు, వర్గీకరణ మార్పులు
- ప్రధాని, కేంద్రమంత్రులతో భేటీలు



02

## జ్ఞానేష్ ను కాపాడాలనుకుంటే మునిగేది మీరే!



కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మనుగడ సాగించాలంటే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తో వెంటనే రాజీనామా చేయించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవు చెప్పారు. జ్ఞానేష్ కుమార్ ను కాపాడాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు క్షమించబోరని అన్నారు. ఢిల్లీలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లను తొలగించి, వారికి తీరని అన్యాయం చేయడానికి సీఈసీ ప్రయత్నించారన్నారు. ముద్ర న్యూస్ బ్యూరో, న్యూఢిల్లీ:

# రాహుల్, ప్రియాంక అరెస్ట్

నిరసనకు వెళ్లిన ఇండియా బ్లాక్ నేతలు అదుపులోకి



- అనుమతి లేదంటూ అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- రెండో రోజు ఆందోళన
- ఈసీని కలిసేందుకు అనుమతించాలని డిమాండ్
- నిరసనలపై ఎఫ్ఐఆర్‌లు.. పట్టించుకోబోమన్న కాంగ్రెస్ నేతలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఇండియా కూటమి నేతలను ఢిల్లీ పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. జన్‌పథ్ వద్దకు చేరుకున్న ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి జంతర్‌మంతర్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారి బస్సులను జన్‌పథ్–అశోకా రోడ్ కూడలి వద్ద అడ్డుకున్నారు. దీంతో రాహుల్ గాంధీ, ఇతర నేతలు రోడ్డుపై నిరసనకు దిగారు.
అనంతరం పోలీసులు రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో తరలించారు. ప్రియాంక గాంధీతో పాటు పలువురు మహిళా ఎంపీలను కూడా పోలీసులు అక్కడి నుంచి తరలించారు. అయితే ప్రియాంక గాంధీని నిర్బంధంలోకి తీసుకోవడానికి పోలీసులు చాలా కష్టపడాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ తాను కూర్చున్న చోటు నుంచి కదల బోనని ఆమె అరెస్టుకు సహకరించకపోవడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆమెను ఎత్తుకొని తీసుకెళ్లాల్సి వచ్చింది. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తూ, దీనిపై ప్రధాన ఎన్నికల కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీలో వరుసగా రెండో రోజు ఇండియా కూటమి నేతల నిరసనలు, అరెస్టులు చోటుచేసుకోవడం రాజకీయంగా సంచలనం సృష్టించింది.

ఇదీ AI ముద్ర

జ్ఞానేష్ ను కాపాడాలనుకుంటేమునిగేది మీరే...: మోదీకి రేవంత్ సూచన



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in | @mudranews

గురువారం, 08 అక్టోబర్, 2026

2 జనరల్ న్యూస్
General NEWS

## దగ్గు, జలుబు తగ్గాలంటే ఇలా చేయాలి

దగ్గు మరియు జలుబు కోసం లవంగాలు, దాల్చినచెక్క, తులసి, అల్లం మరియు పసుపు వంటి సాధారణ ఆయుర్వేద మూలికలతో చేసిన టీలను లేదా కషాయాలను ఆయుర్వేద వైద్యులు ఎక్కువగా సిఫార్సు చేస్తారు. ఈ టీలు మీ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి మరియు మధ్యమధ్యలో తాగినప్పుడు ఉపశమనాన్ని, స్వస్థతను కూడా అందిస్తాయి.



### ఎర్రవల్లిలో..

# 45 ఎకరాలు మాయం!

**(మొదటి పేజీ తరువాయి)**
నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం తదితర అంశాల ను అధికారులు పరిశీలించనున్నారు.

**22-ఏ భూముల వ్యవహారంతో వెలుగులోకి..**
ఎర్రవల్లి భూముల అంశం తాజాగా తెరపైకి వచ్చినప్పటికీ.. రాష్ట్రంలో భూ రికార్డులు, నిషేధిత భూముల వ్యవహారాలపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించింది. ఇటీవల శాసనసభలో 22–ఏ నిషేధిత భూముల జాబితాపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు.
ఈ విచారణలో భాగంగా భూముల రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలు, నిషేధిత జాబితాలో చేరిన భూములు, వాటి వెనుక ఉన్న కారణాలు, ధరణి రికార్డుల్లో జరిగిన మార్పులు వంటి అంశాలపై పరిశీలన జరుగుతోంది. ఈ విచారణ పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోదీ పెవిలియన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ అక్రమాలపై ఏర్పాటు చేసిన కమిటీ, ధరణి అక్రమాలపై విచారణకు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు సమావేశానికి హాజరై ప్రాథమికంగా గుర్తించిన అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.

**భూమి ఎక్కడికి వెళ్లింది?**
సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు ఉన్నట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో 343 ఎకరాలే గుర్తించడంతో.. మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడికి వెళ్లింది? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. భూమి విస్తీర్ణంలో తేడా రావడానికి కారణాలు ఏమిటన్నదానిపై అధికారులు దృష్టి సారించనున్నారు. పాత సర్వే రికార్డులు, ప్రస్తుత రికార్డులు, భూముల హద్దులు, భౌగోళిక పరిస్థితులను సరిపోల్చి చూడనున్నారు. అవసరమైతే సంబంధిత వ్యక్తుల నుంచి పత్రాలను సేకరించి పరిశీలించే అవకాశం ఉంది. ప్రత్యేక సర్వే అనంతరం 45 ఎకరాలపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

**అమరవీరుల కుటుంబాలకు 'కాలనీ'**
ఎర్రవల్లి భూముల వ్యవహారంపై సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు కేవలం ఇళ్ల స్థలాలు ఇవ్వడం మాత్రమే కాకుండా.. అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో ప్రత్యేక కాలనీని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని సూచించారు. వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**వెలికట్టలో ఎడ్యుకేషన్ హబ్**
కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో కూడా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. అసైన్డ్ భూములు, మిషన్ భగీరథకు సంబంధించిన భూములను మినహాయించి మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ (YIIRS)తో పాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా రంగానికి అవసరమైన మౌలిక వసతులను ఒకే ప్రాంతంలో సమీకరించేలా ఈ ఎడ్యుకేషన్ హబ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**మల్లన్నసాగర్ నీటిపై నిఘా**
మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా మల్లన్నసాగర్ నీటిని అనుమతి లేకుండా వినియోగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి వినియోగంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**ఇప్పుడు అసలు ప్రశ్న.. 45 ఎకరాల సంగతేంటి?**
ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం ఉన్న 388 ఎకరాలకు, క్షేత్రస్థాయిలో గుర్తించిన 343 ఎకరాలకు మధ్య ఉన్న 45 ఎకరాల భూమి వ్యవహారం ఇప్పుడు రాజకీయంగానూ, పరిపాలనాపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేక సర్వే నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అధికారులు భూముల హద్దులను పునఃపరిశీలించనున్నారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల రికార్డులు కూడా పరిశీలనకు వస్తాయని అధికారులు చెప్పడంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. 45 ఎకరాల భూమి నిజంగా ఎక్కడుంది? రికార్డుల్లోనే తప్పిదమా? హద్దుల్లో మార్పులా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్నది సమగ్ర సర్వే, విచారణ పూర్తయితేనే తేలనుంది. ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.

# కాంగ్రెస్ సైలెన్స్.. వ్యూహం?

**(మొదటి పేజీ తరువాయి)**
పేపర్ క్లిప్పింగులు, సోషల్ మీడియా పోస్టులు, ఆరోపణలతో ప్రచారం సాగుతున్నప్పటికీ.. బలమైన రాజకీయ అంశంగా మార్చేందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ కనిపించడం లేదనే అభిప్రాయం ఉంది.

**కాంగ్రెస్ మౌనం.. వ్యూహాత్మక అడుగేనా?**
ప్రతిపక్షం చేసే ప్రతి విమర్శకు ముఖ్యమంత్రి స్థాయిలో స్పందిస్తే, ఆ ఆరోపణలకు మరింత ప్రచారం కల్పించినట్లవుతుందని కాంగ్రెస్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే రేవంత్‌రెడ్డి సైలెంట్‌గా ఉంటూ, అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం, చట్టపరమైన మార్గాలను ఉపయోగిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.

**బీఆర్ఎస్ వ్యూహం మార్చాల్సిన అవసరమా?**
రాజకీయ ఆరోపణలకు నాయకత్వ స్థాయి, ఆధారాలు, కమ్యూనికేషన్ విధానం కీలకంగా మారాయి. కేటీఆర్ లేదా హరీష్‌రావు స్వయంగా ఆధారాలతో మీడియా ముందుకు వచ్చి సీఎం కుటుంబంపై ఆరోపణలు చేస్తే వచ్చే రాజకీయ ప్రభావం వేరుగా ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌ల ద్వారా ఆరోపణలు చేయించి, ఆ తర్వాత కేసులు, ట్వీట్ల చుట్టూ రాజకీయ చర్చను నడపడం వల్ల అసలు ఆరోపణ వెనుక ఉన్న అంశం ప్రజల్లో బలంగా నిలవడం లేదన్న వాదన వినిపిస్తోంది.

**మైండ్ గేమ్‌లో ఎవరిది పైచేయి?**
ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఇది కేవలం ఆరోపణల పోరాటం మాత్రమే కాదు.. కమ్యూనికేషన్ మైండ్ గేమ్‌గా మారింది. రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష దాడులతో బీఆర్ఎస్‌ను రక్షణాత్మక స్థితిలోకి నెట్టగలుగుతున్నారా? బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు ఎందుకు అదే స్థాయిలో ప్రజల్లో చర్చకు రావడం లేదు? అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చ. ఆరోపణలకు బలం చేకూర్చేది కేవలం సోషల్ మీడియా ప్రచారం కాదు.. అగ్రనాయకత్వం, స్పష్టమైన ఆధారాలు, నిరంతర రాజకీయ ఫాలోఅప్ కూడా అవసరం. ఈ విషయంలో బీఆర్ఎస్ తన వ్యూహాన్ని మార్చుకుంటుందా? లేక కాంగ్రెస్ మౌన వ్యూహమే కొనసాగుతుందా? అన్నది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.



### ఓట్, సీట్ చోరీ పేటెంట్

# కాంగ్రెస్‌దే



**ముద్ర, డెస్క్:**
ఓట్ చోరీ, సీట్ చోరీ పేటెంట్ రైట్స్ కాంగ్రెస్‌కే ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలో తొలిసారిగా ఓటు, సీట్ చోరీకి పాల్పడిన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. 1946లో దేశంలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పేరును ప్రతిపాదించాయని, అయినప్పటికీ నెహ్రూను ప్రధాని చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని విమర్శించారు. ప్రధాని మోదీకి ఓట్, సీట్ చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. దేశ ప్రజలనే కుటుంబంగా భావిస్తూ మోదీ 25 ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు.

**ఈసీని బద్నాం చేయొద్దు**
ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విషయంలో ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. "రాజ్యాంగ సంస్థపై దాడి చేయడం దుర్మార్గం. రాహుల్ గాంధీ ఈసీని ఎప్పుడైనా కలవొచ్చు. అపాయింట్‌మెంట్ ఎందుకు తీసుకోలేదు?" అని ప్రశ్నించారు. వందల మందితో ఈసీ కార్యాలయానికి వెళ్తే అడ్డుకోకుండా ఏం చేస్తారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు.

**ఓట్ల తొలగింపుపై వివాదం**
దేశవ్యాప్తంగా మృతులు, డూప్లికేట్ ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ నేతలే గతంలో మాట్లాడారని బండి సంజయ్ పేర్కొన్నారు. దేశంలో 2.8 కోట్ల మంది మరణించిన వారి ఓట్లు తొలగించాలని కాంగ్రెస్ కోరిందని అన్నారు. తెలంగాణలో 70 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని అభిషేక్ సింఘ్వీ, మధ్యప్రదేశ్‌లో 60 లక్షల ఓట్లు ఉన్నాయని, రాజస్థాన్‌లో 45 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారని గుర్తుచేశారు. కేరళలో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా అమలు కావడం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రమేశ్ చెన్నితల చెప్పారని అన్నారు. ఈసీ తప్పు చేస్తే సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

**కేసీఆర్ భూములపై డ్రామా**
కేసీఆర్ కుటుంబ భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్ప.. వాస్తవంగా చర్యలు తీసుకునే ఉద్దేశం లేదని బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

**పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా..**
బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు కల్పించిందని బండి సంజయ్ అన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని చెప్పారు. కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యువత రాజకీయ నేపథ్యం, చరిత్ర, ప్రజా సేవను పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.

# వాస్తవాలను కప్పిపుచ్చలేరు

### హరీశ్ రావు వ్యాఖ్యలకు మంత్రి భట్టి విక్రమార్క కౌంటర్

**ముద్ర, డెస్క్:**
రాష్ట్ర విద్యుత్ రంగం, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న విమర్శలకు డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న వారు తీసుకున్న నిర్ణయాలకు ఇప్పుడు సమాధానం చెప్పాలని అన్నారు. తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేయొద్దని సూచించారు. యాదాద్రి ప్లాంట్ నిర్మాణానికి ముందే అవసరమైన బొగ్గు కేటాయింపులు, సరఫరా లింకేజీలను ఖరారు చేయలేదని ఆరోపించారు. థర్మల్ ప్లాంట్‌కు స్థలం, డీపీఆర్, సాంకేతిక అంశాలతో పాటు బొగ్గు సరఫరా అత్యంత కీలకమని చెప్పారు. ప్లాంట్‌కు బొగ్గు ఎక్కడి నుంచి వస్తుంది, ఎంత లభిస్తుంది, నాణ్యత, సరఫరా సామర్థ్యంపై స్పష్టమైన ప్రణాళిక లేకుండానే నిర్మాణం చేపట్టారని విమర్శించారు. ఈ అంశాలకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు.
ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడిన భట్టి.. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందన్నారు. దాదాపు 20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఏపీలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని వివరించారు. విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది పనితీరును అభినందించాల్సింది పోయి తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

**ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు**
డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించనున్నారన్న ప్రచారాన్ని భట్టి ఖండించారు. పవర్ సెక్టార్‌ను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. "పవర్ సెక్టార్‌ను అమ్మేయాలన్న ఆలోచన, చర్చ అసలు లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని మేము విశ్వసిస్తున్నాం" అని చెప్పారు.

**14 మిలియన్ టన్నులకు 1.71 మిలియన్ టన్నులే**
యాదాద్రి ప్లాంట్ కోసం 2016లో సింగరేణి, టీఎస్ జెన్‌కో మధ్య జరిగిన ఒప్పందంలో 14 మిలియన్ టన్నుల అవసరానికి 7 మిలియన్ టన్నులు మాత్రమే సింగరేణి నుంచి తీసుకునేలా నిర్ణయించారని భట్టి తెలిపారు. మిగిలిన బొగ్గును దిగుమతి చేసుకునేందుకు ఎంఎస్‌టీసీతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. అయితే అవి అమలు కాలేదని, 2022లో మొత్తం 14 మిలియన్ టన్నుల బొగ్గును సింగరేణి నుంచే సరఫరా చేస్తామని మరో అవగాహనకు వచ్చారని వివరించారు. 2022–23లో సింగరేణిలో జీ–9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కేవలం 1.71 మిలియన్ టన్నులు మాత్రమే ఉన్నప్పుడు యాదాద్రికి 14 మిలియన్ టన్నులు ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. "బొగ్గు కేటాయింపులు లేకుండానే ప్లాంట్ నిర్మిస్తారా? బొగ్గు లేకపోతే ప్లాంట్ ఎలా నడుస్తుంది?" అని హరీశ్ రావును ప్రశ్నించారు.

**బొగ్గు బ్లాకులపైనా వైఫల్యమే**
కొత్త బొగ్గు బ్లాకులను సాధించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని భట్టి ఆరోపించారు. 2014–15లో 52.66 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2025–26లో 62.07 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరిందని తెలిపారు. 2014–2024 మధ్య 14 బొగ్గు బ్లాకులు మూతపడటంతో సుమారు 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి తగ్గిందన్నారు. కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణిని పాల్గొనకుండా పక్కన పెట్టారని విమర్శించారు. నైనీ కోల్ బ్లాక్‌లో మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. అయితే అక్కడి బొగ్గుకు ఇప్పటికే ఇతర ప్లాంట్లకు కేటాయింపులు ఉన్నందున యాదాద్రికి మొత్తం మళ్లించడం సాధ్యం కాదన్నారు. ప్రత్యేక కోల్ అలాట్‌మెంట్ కోసం కేంద్రాన్ని కోరుతున్నామని తెలిపారు.

**యాదాద్రి విద్యుత్ ధర రూ.6.66**
యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ధర యూనిట్‌కు రూ.6.66గా ఉందని భట్టి తెలిపారు. కాకతీయ ప్లాంట్ నుంచి రూ.4.17, భద్రాద్రి ప్లాంట్ నుంచి రూ.4.60–రూ.5.10 పరిధిలో విద్యుత్ లభిస్తోందని చెప్పారు. యాదాద్రి విద్యుత్ ధర అధికంగా ఉండటంతో ఆర్థిక భారం వినియోగదారులపైనే పడుతుందని అన్నారు. ప్లాంట్ జీవితకాలం సుమారు 25 సంవత్సరాలు కావడంతో దీర్ఘకాలికంగా రాష్ట్రంపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు.

**ఆలస్యానికి గత ప్రభుత్వమే కారణం**
యాదాద్రి ప్లాంట్ రెండేళ్లు ఆలస్యం కావడానికి గత ప్రభుత్వ నిర్ణయాలే కారణమని భట్టి అన్నారు. పర్యావరణ అనుమతుల సమయంలో 50 శాతం విదేశీ, 50 శాతం స్వదేశీ బొగ్గు వినియోగిస్తామని చెప్పి, అనంతరం 100 శాతం సింగరేణి బొగ్గు వినియోగిస్తామని పేర్కొంటూ ఎన్జీటీని ఆశ్రయించారని తెలిపారు. ఎన్జీటీ అనుమతులు రద్దు చేసిన తర్వాత అవసరమైన స్థాయిలో ఫాలోఅప్ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఫిబ్రవరి 20న పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించిందన్నారు. ప్రస్తుతం యూనిట్లను వరుసగా అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు.

**వారానికి ఒకసారి ఆధారాలతో..**
యాదాద్రి ప్లాంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానం ఇస్తామని భట్టి ప్రకటించారు. 'గత ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచుతాం. వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో వాస్తవాలను ప్రజాక్షేత్రంలో పెడతాం' అని చెప్పారు. విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యుత్ సంస్థలు, సింగరేణిపై అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదన్నారు.

# ఆర్బీఐ రెపో రేటు పెంపు

### పెరగనున్న ఈఎంఐల భారం

**ముద్ర, డెస్క్:**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పాలసీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచుతూ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్వైమాసిక సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు 5.25 శాతంగా ఉన్న రెపో రేటు 5.50 శాతానికి చేరింది. దేశీయంగా ఆహార, సేవా రంగాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అంతర్జాతీయ ముడిచమురు మార్కెట్‌లో అస్థిరత, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువపై ఒత్తిడి వంటి అంశాల నేపథ్యంలో వడ్డీ రేటును పెంచినట్లు ఆర్బీఐ తెలిపింది.
రెపో రేటు పెంపు ప్రభావం బ్యాంకుల రుణాలపై పడే అవకాశం ఉంది. ఆర్బీఐ నుంచి బ్యాంకులు తీసుకునే నిధుల వ్యయం పెరగడంతో వాణిజ్య బ్యాంకులు తమ రుణ వడ్డీ రేట్లను సవరించే అవకాశం ఉంది. దీంతో ఇప్పటికే గృహ, వ్యక్తిగత, వాహన రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐ భారం పెరగవచ్చు. కొత్తగా రుణాలు తీసుకునేవారికి కూడా అధిక వడ్డీ చెల్లించాల్సి రావచ్చు.
మరోవైపు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) చేసే వారికి కొంత ప్రయోజనం కలగనుంది. బ్యాంకులు డిపాజిట్ వడ్డీ రేట్లను పెంచితే డిపాజిటర్లు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అదనపు వడ్డీ ఆదాయం లభించే అవకాశం ఉంది. పండుగల సీజన్‌కు ముందు వడ్డీ రేట్ల పెంపు రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### ఉద్యోగులకు దసరా కానుక..

# రెండు డీఏలు మంజూరు

**ముద్ర, డెస్క్:**
దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందించింది. రెండు డీఏలు (కరువు భత్యం) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రెండు డీఏలు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. డీఏ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడనుంది. జనవరి 2024 నుంచి డీఏను 37.31 శాతానికి పెంచారు. 2015 పే స్కేల్ ఉద్యోగులకు 81.72 శాతం, 2020 పే స్కేల్ ఉద్యోగులకు 40.04 శాతం, 2016 పే స్కేల్ ఉద్యోగులకు 53 శాతం, 2006 పే స్కేల్ ఉద్యోగులకు 246 శాతానికి డీఏ పెంచారు. యూజీసీ, ఏఐసీటీఈ పరిధిలోని ఉద్యోగులకు కూడా ఈ పెంపు వర్తించనుంది. పెంచిన డీఏను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించనున్నారు. నవంబర్ 1న ఉద్యోగుల ఖాతాల్లో పెరిగిన డీఏ జమ కానుంది.

**33 వాయిదాల్లో బకాయిల చెల్లింపు:**
డీఏ బకాయిలను ప్రభుత్వం 33 వాయిదాల్లో చెల్లించనుంది. జూలై 2024 డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనుంది.

# విదేశీ వర్సిటీలకు ఏపీలో దారి



**ముద్ర, డెస్క్:**
సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం దాదాపు మూడు గంటలపాటు కొనసాగింది. రాష్ట్ర అభివృద్ధి, విద్య, వైద్యం, సంక్షేమానికి సంబంధించిన 12 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026–27 విద్యా సంవత్సరానికి 'తల్లికి వందనం' పథకం మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతులకు రాటిఫికేషన్ ఇచ్చింది. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల డైట్ ఛార్జీల పెంపునకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నం మరికవలసలో గిరిజన విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ, నీట్ కోచింగ్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనుంది. ఏపీ విద్యా చట్టం–1982 సవరణలకు కూడా పచ్చజెండా ఊపింది. విదేశీ ఉన్నత విద్యాసంస్థలు, ప్రైవేట్ యూనివర్సిటీలు రాష్ట్రంలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు 'నూతన పాలసీ–2026'కు ఆమోదం తెలిపింది. బాపట్ల జిల్లా రేపల్లెలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.58.42 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అదనంగా 66 పోస్టులు మంజూరు చేయనున్నారు. హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రాజెక్టుకు రూ.20.62 కోట్లతో 72 నెలల పాటు అమలు చేయడానికి ఆమోదం లభించింది. పలు ప్రాంతాల్లో భూ వర్గీకరణ మార్పులు, బదలాయింపులకు కూడా కేబినెట్ అనుమతించింది.

**ఢిల్లీకి చంద్రబాబు**
మరోవైపు సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో వరుసగా భేటీ కానున్నారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు తుది ఆమోదం, విశాఖ బీచ్ కారిడార్‌కు కేంద్ర సహకారం కోరనున్నారు. నదుల అనుసంధానం, గోదావరి వరద జలాల వినియోగంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించనున్నారు. గోదావరి పుష్కరాలకు కేంద్ర సహాయం కోరనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా అభివృద్ధి చేసే అంశంపై చర్చించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక నిధులు కోరనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతోనూ సమావేశం కానున్నారు. ఢిల్లీలో జరిగే సీఐఐ పార్టనర్‌షిప్ సదస్సు 'కర్టెన్ రైజర్'లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి పాల్గొంటారు. పర్యటన ముగించుకుని గురువారం రాత్రి అమరావతికి తిరిగి రానున్నారు.

## అధిక రక్తపోటు తగ్గాలంటే.. ఉప్పు తగ్గించాలి

ఆహారంలో ఉప్పు (సోడియం) వాడకం తగ్గించాలి. ప్యాకెట్ ఆహారాలు, పచ్చళ్లు, ఫాస్ట్ ఫుడ్స్కు దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.



కొమురం భీం పోరాట స్ఫూర్తితో

# జర్నలిస్టులు ఉద్యమించాలి

**- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ**




ఆసిఫాబాద్, అక్టోబర్ 7:

జోడేఘాట్ సాక్షిగా 'జల్, జంగల్, జమీన్' కోసం పోరాడిన కొమురం భీం స్ఫూర్తితో జర్నలిస్టులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తృతీయ మహాసభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. అణచివేతకు, అన్యాయానికి వ్యతిరేకంగా కొమురం భీం చేసిన పోరాటం ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆసిఫాబాద్ కేవలం అడవులకు మాత్రమే పరిమితమైన ప్రాంతం కాదని, ఆదివాసీల ఆత్మగౌరవానికి చిరునామా అని విరాహత్ అలీ అన్నారు. కొమురం భీం పోరాట వారసత్వాన్ని మోస్తున్న నేలగా ఆసిఫాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

టీయూడబ్ల్యూజేకు 75 ఏళ్ల పోరాట చరిత్ర ఉందని, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న అనేక సౌకర్యాలు తమ సంఘం పోరాటాల ఫలితంగానే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదని విరాహత్ అలీ అన్నారు.

రాష్ట్రం లో జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్ అమలు కాకపోవడంతో అనారోగ్య సమ యంలో అప్పులు చేసి చికిత్స పొందాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక స్తోమత లేక కొందరు చికిత్స పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాల హామీని కూడా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రభు త్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ, ట్రేడ్ యూనియన్ నిబంధనలకు అనుగుణంగా సంస్థాగత నిర్మాణంతో రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంఘంగా టీయూడబ్ల్యూజే కొనసాగుతోందన్నారు. 33 జిల్లాల్లో వేలాది మంది జర్నలిస్టుల సభ్యత్వంతో సంఘం శాఖలు పనిచేస్తున్నాయని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం మినహా తమకు ఇతర వ్యామోహాలు లేవని రాంనారాయణ అన్నారు.

### కథనాల్లో వాస్తవాలు ఉండాలి

**- కలెక్టర్ హరిత**

ప్రజా సమస్యలపై జర్నలిస్టులు రాసే కథనాల్లో వాస్తవాలు ఉంటేనే అవి ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతాయని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం, జర్నలిస్టులు టీమ్‌వర్క్‌తో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చని సూచించారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహ్మాన్, సంపత్, జిల్లా నాయకులు కృష్ణంరాజు, ప్రకాష్ గౌడ్, జమీల్, గిరిజాబాయి, సతీష్, సుమారు 250 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఆరోపణలు, ప్రత్యారోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలి

**- సీఎం, కేటీఆర్ ఆరోపణలపై గవర్నర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి**



హైదరాబాద్, అక్టోబర్ 7:

ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మధ్య కొనసాగుతున్న ఆరోపణలు, ప్రత్యారోపణలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ గవర్నర్‌ను కోరింది. ఈ మేరకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు యం. పద్మనాభరెడ్డి బుధవారం గవర్నర్‌కు లేఖ రాశారు. ముఖ్యమంత్రి శాసన సభలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు సుమారు రూ.1 లక్ష కోట్ల విలువైన భూములను కూడబెట్టుకున్నారని ఆరోపించిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. అలాగే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావుకు గచ్చిబౌలిలో అనేక హోటళ్లు ఉన్నాయని, ఆయన అక్రమంగా సంపాదించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిధులను సింగపూర్, అమెరికాలో పెట్టుబడులుగా పెట్టారని ముఖ్యమంత్రి వివిధ సందర్భాల్లో ఆరోపించినట్లు పేర్కొన్నారు.

మరోవైపు, ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా ఆరోపణలు చేశారని ఫోరం తెలిపింది. ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపులు, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తదితర పనుల్లో ముఖ్యమంత్రి బంధువులకు కాంట్రాక్టులు కేటాయించారనే ఆరోపణలు చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. ఇలా ఇరుపక్షాల నుంచి తరచూ ఆరోపణలు, ప్రత్యారోపణలు వెలువడుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అభిప్రాయపడింది. ప్రజా జీవితంలో ఉన్న రాజకీయ నాయకుల నిజాయితీ, పారదర్శకతపై సందేహాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొంది.

ప్రత్యేకంగా ముఖ్యమంత్రి శాసనసభలో చేసిన తీవ్రమైన ఆరోపణలపై వాస్తవాలను తెలుసుకునే హక్కు తెలంగాణ ప్రజలకు ఉందని ఫోరం తెలిపింది. ఆరోపణలు, ప్రత్యారోపణలపై చట్ట ప్రకారం తగిన స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణకు ఆదేశించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గవర్నర్‌ను కోరింది.

# రాహుల్ గాంధీ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

**- ఓటు చోరీ ఆరోపణలపై ఈసీ బహిరంగ సమాధానాలు ఇవ్వాలి**

**- ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన ప్రశ్నలను అణచలేరు**

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 7:

ప్రజల ఓటు విలువను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో అడ్డుకోలేరని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల పారదర్శకతపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీసిందని ఉత్తమ్ అన్నారు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై లేవనెత్తిన అభ్యంతరాలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని అన్నారు. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను కాపాడేది అధికార దర్పం కాదని, ప్రజల



విశ్వాసమేనని ఉత్తమ్ పేర్కొన్నారు. నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలన్నారు. ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడంగా భావించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.

### ప్రతి ఓటుకూ విలువ ఉండాలి..

ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయడం సరికాదని ఉత్తమ్ అన్నారు. అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగినా, అది అతని హక్కుకు జరిగిన నష్టమేనని పేర్కొన్నారు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలని కోరారు. ఓటు చోరీ ఆరోపణలను దేశవ్యాప్త చర్చలోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండాలని, ప్రతి ఓటుకు విలువ ఉండాలని రాహుల్ గాంధీ కోరుతున్నారని పేర్కొన్నారు.

### ప్రశ్నించే హక్కును అణచలేరు..

అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ఉందని ఉత్తమ్ అన్నారు. ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై ఉందని పేర్కొన్నారు. విమర్శలను అవహేళన చేయడం, ప్రశ్నించే వారిపై రాజకీయ దాడులకు దిగడం ద్వారా ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించలేరని అన్నారు. ప్రజల తీర్పుతో ఏర్పడే ప్రభుత్వాల విశ్వసనీయతను కాపాడాలంటే, ఆ తీర్పు వెలువడే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని ఉత్తమ్ పేర్కొన్నారు.

ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఒక నాయకుడిని అదుపులోకి తీసుకోవచ్చని, కానీ కోట్లాది ప్రజలకు సంబంధించిన ఓటు హక్కుపై లేవనెత్తిన ప్రశ్నను నిర్బంధించలేరని అన్నారు. ఎన్నికల పారదర్శకతపై ప్రజాస్వామ్య చర్చ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రతిపక్షం లేవనెత్తిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం విశ్వసనీయమైన, బహిరంగ ప్రక్రియ ద్వారా సమాధానాలు ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ప్రతి ఓటును కాపాడటం ద్వారా ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలని ఆయన అన్నారు.

# నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

**- భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యం**

**- నాలుగు మాడ వీధులు, ఔటర్ రింగ్ రోడ్డు, అలిపిరి టోల్‌గేట్‌లో క్షేత్రస్థాయి పరిశీలన**

**- సీసీటీవీలు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్‌తో నిరంతర నిఘా**

ముద్ర, తిరుపతి/తిరుమల, అక్టోబర్ 7:

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పటిష్ఠమైన భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఇరువురు అధికారులు సంయుక్తంగా తిరుమలలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. శ్రీవారి ఆలయ పరిసరాలు, నాలుగు మాడ వీధులు, భక్తుల గ్యాలరీలు, ఔటర్ రింగ్ రోడ్డు, అలిపిరి టోల్‌గేట్ తదితర ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలను క్రమబద్ధీకరించాలని, అవసరమైన ప్రాంతాల్లో డైవర్షన్లు, బ్యారికేడ్లు, మార్గదర్శక సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్, హోల్డింగ్ పాయింట్ల నుంచి భక్తుల రవాణా ఏర్పాట్లను సమన్వయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు.

వాహన సేవల సమయంలో నాలుగు మాడ వీధుల్లో భారీగా భక్తులు చేరే అవకాశం ఉన్నందున ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, గ్యాలరీలు, బ్యారికేడ్లు, అత్యవసర మార్గాలను స్పష్టంగా ఉంచాలని అధికారులు సూచించారు. రద్దీ ఒక్కసారిగా పెరిగితే తక్షణమే స్పందించేలా వ్యూహాత్మక ప్రాంతాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తిరుమల, తిరుపతి పరిధిలోని సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా భక్తుల రద్దీ, వాహనాల కదలికలు, కీలక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీసు, టీటీడీ విజిలెన్స్ బృందాలు సమన్వయంతో పనిచేసి రద్దీ ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుమలకు ప్రధాన ప్రవేశ మార్గమైన అలిపిరి టోల్‌గేట్ వద్ద వాహనాలు, భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు భద్రతా తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, భద్రతా తనిఖీల కారణంగా భక్తులకు అనవసర ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అక్టోబర్ 16న జరిగే గరుడ వాహన సేవకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆ రోజుకు ప్రత్యేక రద్దీ, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ప్రణాళికలను ముందుగానే అమలు చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, దసరా సెలవుల కారణంగా ఈసారి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

పోలీసులు, టీటీడీ విజిలెన్స్, రవాణా, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, టీటీడీ సీవీ అండ్ ఎస్వో కె.వి. మురళీకృష్ణ స్పష్టం చేశారు.

భక్తులు పోలీసు, టీటీడీ సిబ్బంది సూచనలు పాటిస్తూ కేటాయించిన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను మాత్రమే వినియోగించాలని, రద్దీ ప్రాంతాల్లో క్రమశిక్షణ పాటించి భద్రతా ఏర్పాట్లకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో తిరుమల అదనపు ఎస్పీ ఐ. రామకృష్ణతో పాటు డీఎస్పీలు, సీఐలు, టీటీడీ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలి

**–రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**- ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం**



ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 7:

రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీఈ అండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఐఈఈఈ వేదికపై హైదరాబాద్ విద్యార్థి ప్రతిభ

**- వేద గణితంతో జాతీయ స్థాయి అవార్డు.. ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు**

ముద్ర న్యూస్ బ్యూరో, హైదరాబాద్:

పాఠశాల స్థాయిలోనే వేద గణితంలో జాతీయ స్థాయి అవార్డు సాధించిన హైదరాబాద్‌కు చెందిన ప్రణీత్ ముక్కాల తాజాగా అంతర్జాతీయ సాంకేతిక వేదికపై తన ప్రతిభను చాటారు. హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగిన 2026 IEEE Technology Summit – Ethical AIలో ప్రణీత్ రూపొందించిన 'Vedic-Mind' ప్రాజెక్టు గ్లోబల్ ఫైనలిస్టుల్లో చోటు దక్కించుకుంది. IEEE Entrepre-neurship ఆధ్వర్యంలో నిర్వహించిన AI Founder Showcase – Ideation Trackకు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి 115 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎంపికైన ఐదు ఉత్తమ ప్రాజెక్టుల్లో 'VedicMind'కు స్థానం లభించింది.

### పాఠశాల నుంచే ఆసక్తి

ప్రణీత్ పాఠశాల స్థాయిలోనే వేద గణితాన్ని అభ్యసించారు. అందులో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారు. అప్పటి నుంచి వేద గణితాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించాలనే ఆలోచనతో 'VedicMind'ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రణీత్ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నారు. విద్యాభ్యాసంతో పాటు 'VedicMind' ప్రాజెక్టుపై పనిచేస్తున్నారు.

### అందరికీ చేరువ చేయాలని..

వేద గణితాన్ని విద్యార్థులకు సులభంగా, ఆసక్తికరంగా నేర్పించడమే 'Vedic-Mind' ఉద్దేశమని ప్రణీత్ తెలిపారు. గేమిఫికేషన్, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు. 'VedicMind' వెబ్‌సైట్‌ను మరింత ఆధునీకరించి, అన్ని వర్గాల వారికి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.




విద్యార్థి దశలోనే జాతీయ స్థాయి అవార్డు నుంచి అంతర్జాతీయ IEEE వేదిక వరకు ప్రణీత్ సాధించిన ప్రస్థానం పలువురిని ఆకట్టుకుంటోంది. యువతలోని సృజనాత్మకతకు, సాంకేతిక ఆలోచనలకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

మంగళవారం, 06 అక్టోబర్, 2026



## వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలవండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com



### విటమిన్లు, ఖనిజాలకు నిలయం

# పెసర్లు..

శరీరానికి అవసరమైన అద్భుతమైన ఆహార పదార్థాలలో పెసలు ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. పూర్వీకుల కాలం నుండి వీటిని మన ఆహారంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. ఆధునిక వైద్యులు కూడా రోజువారీ ఆహారంలో పెసలను చేర్చుకోవాలని బలంగా సిఫార్సు చేస్తున్నారు. పెసలు కేవలం రుచికరమైనవే కాకుండా, మన శరీరానికి అవసరమైన అనేక రకాల పోషకాలను అందిస్తాయి. జ్వరం, మలబద్ధకం వంటి సాధారణ అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగించడంలో ప్రమాదకరమైన వ్యాధుల నుండి రక్షణ కల్పించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

### పోషకాల గని పెసలు..

పెసలు ప్రోటీన్లకు అద్భుతమైన మూలం. ఈ ప్రోటీన్లు శరీర నిర్మాణం, కండరాల పనితీరు మెరుగుదల, దెబ్బతిన్న కణజాలాల మరమ్మత్తుకు అత్యవసరం. అంతేకాకుండా, ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. పెసలను నీటిలో నానబెట్టి, మొలకెత్తించి తినడం.. లేదా ఉడికించి తినడం వల్ల వాటి పోషక విలువలు మరింత పెరుగుతాయి. మొలకెత్తిన పెసలలో విటమిన్లు A, B, C, E లు అధికంగా ఉంటాయి. అలాగే, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, కాపర్, ఫోలేట్ వంటి ముఖ్యమైన ఖనిజాలు, డైటరీ ఫైబర్‌లు పుష్కలంగా లభిస్తాయి.

### బరువు తగ్గడంలో సహాయం

పెసలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల, బరువు పెరుగుతామన్న భయం లేకుండా వీటిని నిర్భయంగా తినవచ్చు. వాస్తవానికి, పెసలు బరువు తగ్గడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇవి శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించి, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఐరన్ లోపంతో బాధపడేవారు తమ రోజువారీ ఆహారంలో పెసలను చేర్చుకోవడం ద్వారా రక్తహీనత వంటి వ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చు. పెసలను రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది, ఆకలి నియంత్రించబడుతుంది, తద్వారా బరువు అదుపులో ఉంటుంది.

ఒక కప్పు పెసరపప్పును చపాతీలతో రాత్రిపూట తీసుకుంటే క్రమంగా బరువు తగ్గుతారని పరిశోధకులు సూచిస్తున్నారు. బియ్యంలో కొద్దిగా పెసలు కలిపి పులగం చేసుకుని తినడం కూడా ఊహించని బరువు తగ్గడానికి సహాయపడుతుందని వారు చెబుతున్నారు. తీవ్రమైన ఆకలి సమస్య ఉన్నవారు రోజు పెసలను తింటే ఆకలి అదుపులోకి వస్తుంది.

### డయాబెటిస్ – గుండె ఆరోగ్యం

రోజువారీ ఆహారంలో పెసలను భాగం చేసుకోవడం వల్ల డయాబెటిస్ సమస్య నుండి బయటపడవచ్చు.. రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. పెసలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (LDL)ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ (HDL)ను పెంచుతాయి. ఇది గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పెసలు శరీర మెటబాలిజంను పెంచడానికి సహాయపడతాయి. ఇది కొవ్వు కరిగి బరువు తగ్గడానికి దోహదపడుతుంది.

### రక్తపోటు నియంత్రణ

పెసలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వీటిలోని అధిక ఫైబర్ కంటెంట్ పేగులలోని వ్యర్థాలను బయటకు పంపి, పేగులను శుభ్రంగా ఉంచుతుంది. ఎసిడిటీ, అజీర్ణం, గ్యాస్ వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి పెసలు ఒక అద్భుతమైన పరిష్కారం. ఇవి జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి.

### ఇతర ప్రయోజనాలు

పెసలు స్త్రీ పురుషులిద్దరిలోనూ లైంగిక ఆరోగ్య సమస్యలను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచుతాయని, సంతానం కలిగే అవకాశాలను మెరుగుపరుస్తాయని కూడా కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. పెసలలో ఉండే సోడియం బ్లడ్ ప్రెషర్‌ను తగ్గించి, శరీరాన్ని ఆరోగ్యంగా, చురుకుగా ఉంచడంలో సహాయపడుతుంది.

మొత్తంమీద, పెసలు ఒక సమగ్రమైన సూపర్ ఫుడ్. వాటిని రోజువారీ ఆహారంలో గిన్నెడు పెసలు భాగం చేసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.. ఇంకా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# చైనా దిగుమతులపైనే ఆధారం!



పిల్లల కోసం ఏదైనా కొత్త ఆటవస్తువును కొనడానికి మీరు ఇండియాలో ఓ బొమ్మల దుకాణంలోకి వెళితే చాలు.. చైనాతో మరింత మెరుగైన ఆర్థిక సంబంధాల కోసం భారత్ ఎలా పోరాడుతుందో ఒక అవగాహనకు రావచ్చు. ఆరేళ్ల కిందట దేశీయంగా ఉత్పాదకతను పెంచడానికి నాణ్యత లేని బొమ్మలు మార్కెట్లోకి రాకుండా నిరోధించడానికి.. భారత్‌కు దిగుమతయ్యే బొమ్మలపై టారిఫ్‌లను 20 నుంచి 60శాతానికి, ఆ తర్వాత 70శాతానికి పెంచింది. దీనిపై రిటైలర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. విదేశాల్లో తయారయ్యే వస్తువులతో దేశీయ సంస్థలు ఎప్పటికీ పోటీ పడలేవన్నారు. కస్టమ్స్ డ్యూటీలను పెంచడం , నాణ్యత నియంత్రణ ప్రమాణాలు లాంటి నిర్ణయాలు సత్ఫలితాలు సాధించాయి. భారత్‌కు బొమ్మల దిగుమతులు 2020లో దాదాపు 300 మిలియన్ డాలర్ల (రూ. 2886 కోట్లు) నుంచి ఈ ఏడాది 100 మిలియన్ డాలర్లకు( రూ. 963 కోట్లు) పడిపోయాయి. అదే సమయంలో ఎగుమతులు దాదాపు 129 మిలియన్ డాలర్ల( రూ. 1242 కోట్లు) నుంచి 200 మిలియన్ డాలర్లకు( రూ. 1926 కోట్లు) పెరిగాయి. ఒకప్పుడు స్థానిక బొమ్మల మార్కెట్లో 70శాతం వాటా కలిగి ఉన్న చైనాపై ఆధారపడటాన్ని భారత్ గణనీయంగా తగ్గించుకోగలిగింది.




### వాణిజ్య లోటుతో తీవ్ర నష్టం

చైనాతో రోజురోజుకూ అసమానంగా మారుతున్న వాణిజ్య సంబంధాలను సరిచేయడానికి భారత్ చేసిన ప్రయత్నాలలో ఈ రంగానికి సంబంధించిన విజయం అరుదైన మినహాయింపుగా నిలుస్తుంది. కొంత మంది నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుత ప్రపంచంలోనే ఇది అత్యంత అసమానమైన వాణిజ్య సంబంధాలలో ఒకటి. 2020లో గల్వాన్ వ్యాలీ ఘర్షణల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. యాంటీ-డంపింగ్ డ్యూటీలతో పాటు టిక్‌టాక్ వంటి చైనీస్ యాప్‌లపై దిల్లీ నిషేధం విధించింది. అయినప్పటికీ బీజింగ్‌తో భారత్ వాణిజ్య లోటు 2020లో 44 బిలియన్ డాలర్ల నుంచి ఈ ఏడాది కళ్ళు తిరిగేలా 112 బిలియన్ డాలర్లకు పెరిగింది."చైనాతో రాజకీయ, రక్షణ, పెట్టుబడి సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి దిగజారినా, భారత్ ఆ దేశం మీద ఆర్థికంగా ఆధారపడటం పెరిగింది" అని వాషింగ్టన్‌కు చెందిన ఆసియా సొసైటీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ ఫర్ చైనా అనాలిసిస్ ఫెలో కెవిన్ జోంగ్జే లీ అన్నారు.

### మేకిన్ ఇండియాలో..?

మరింత ఆందోళనకర అంశమేంటంటే చైనా నుంచి భారత్‌కు దిగుమతులు రెట్టింపు అయినప్పటికీ భారత్ నుంచి చైనాకు ఎగుమతులు మాత్రం కోవిడ్ మహమ్మారికి ముందు ఉన్న స్థాయి కంటే తక్కువగానే ఉన్నాయి. "భారత పారిశ్రామిక దిగుమతుల్లో 30 శాతం కంటే ఎక్కువ చైనా నుంచే వస్తున్నాయి.100కి పైగా కీలకమైన ఉత్పత్తుల కోసం భారత్ చైనాపై ఆధారపడి ఉంది. ఇది రోజు రోజుకీ పెరుగుతోంది" అని దిల్లీకి చెందిన గ్లోబల్ ట్రేడ్ అండ్ రీసర్చ్ ఇనిషియేటివ్-జీటీఆర్ఐకి చెందిన అజయ్ శ్రీవాస్తవ చెప్పారు. దిగుమతులు ఇదే వేగంతో కొనసాగితే ద్వైపాక్షిక లోటు 134 బిలియన్ డాలర్లకు పెరగవచ్చు. ఇది భారతీయ పరిశ్రమపై బీజింగ్‌కు మరింత పట్టును ఇస్తుందని శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల సంబంధాలు మెరుగుపడుతున్న తరుణంలో ఇటీవలి బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఈ "నిర్మాణాత్మక వాణిజ్య అసమతుల్యతలు, సరఫరా గొలుసు సమస్యలను" పరిష్కరిస్తామని చెప్పారు. చైనా దిగుమతుల మీద భారత పారిశ్రామిక రంగం ఎంతగా ఆధారపడిందో పరిశీలిస్తే ఇది దిల్లీకి చాలా కష్టతరమైన పని అవుతుందని నిపుణులు చెప్పారు.

### ఇండియాలో అసెంబ్లింగ్

భారత్ కేవలం తుది ఉత్పత్తులను వినియోగించుకోవడానికే కాకుండా పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి కోసం కూడా ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతోంది. నిజానికి స్మార్ట్ ఫోన్లు, సోలార్ పరికరాల వంటి పూర్తయిన వస్తువుల దిగుమతులపై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకుంది. ఇప్పుడు ప్రపంచంలోని ఐఫోన్‌లలో పావు వంతు కంటే ఎక్కువ ఇక్కడే ఉత్పత్తి చేస్తోంది. "అయినప్పటికీ ఐ ఫోన్ల ఉత్పత్తి అంతా అసెంబ్లింగ్ ఆధారితంగానే ఉంది. వాటి విడిభాగాల కోసం ముఖ్యంగా చైనా నుంచి వచ్చే దిగుమతుల పైనే ఎక్కువగా ఆధారపడింది" అని శ్రీవాస్తవ చెప్పారు. పారిశ్రామిక యంత్రాలు, బ్యాటరీ ఇన్‌పుట్‌లు, రసాయనాలు, సోలార్ సెల్‌లు, ఉత్పాదక పరికరాల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. చైనా నుంచి వచ్చే దిగుమతులలో ఎలక్ట్రికల్ మెషినరీ, ఎలక్ట్రానిక్స్ మాత్రమే 36 శాతం వాటాను కలిగి ఉండగా యంత్రాలు, మెకానికల్ పరికరాలు 21.7శాతంతో తర్వాతి స్థానంలో ఉన్నాయని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ థింక్ ట్యాంక్ తెలిపింది. ఆర్గానిక్ రసాయనాలు, ప్లాస్టిక్ ముడి పదార్థాల వాటా కూడా గణనీయంగా ఉంది. "ఈ దిగుమతులకు అంతరాయం ఏర్పడితే అది వినియోగాన్ని ప్రభావితం చేయడమే కాకుండా ఉత్పత్తి ప్రక్రియని కూడా దెబ్బతీస్తుంది" అని అబ్జర్వర్ రీసర్చ్ ఫౌండేషన్ సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ డిప్లొమసీ ఫెలో సౌమ్య భౌమిక్ అన్నారు. చైనా దిగుమతులను స్థానిక ఉత్పత్తితో భర్తీ చేయడంలో భారత్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇది ప్రతిబింబిస్తోందని ఆయన వాదించారు.

### చైనా మర్కెట్ లో అడ్డంకులు

ఇన్‌పుట్‌లు, ముడి పదార్థాలపై ఆధారపడటం పెరగడంతో పాటు ఇతర స్థూల ఆర్థిక పోకడల వల్ల కూడా భారత్‌కు చైనీస్ దిగుమతులు పెరుగుతున్నాయి. స్టీల్, సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు అనేక ఇతర రంగాలలో చైనాకు భారీ అదనపు ఉత్పత్తి సామర్థ్యం ఉంది. అయితే చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం ఆ ఉత్పత్తులను వినియోగించుకోలేకపోతోంది. దీంతో చైనా ఉత్పత్తిదారులు విదేశీ మార్కెట్లలోకి విస్తరిస్తూ తమ వస్తువులను చౌకగా విక్రయిస్తున్నారు. చైనా వాణిజ్య మిగులు వరుసగా రెండో ఏడాది కూడా ట్రిలియన్ డాలర్లు దాటుతుందని అంచనా. చైనా వివిధ రంగాలలో తయారీని వేగంగా విస్తరిస్తూ ఉండటం "పాశ్చాత్య మార్కెట్లు చైనా వస్తువుల మీద టారిఫ్‌లు, ఇతర ఆంక్షలను విధిస్తూ ఉండటంతో" చైనా ఉత్పత్తులు భారత తీరాలకు చేరుకుంటున్నాయి' అని శ్రీవాస్తవ చెప్పారు. మరో వైపు చైనా మార్కెట్ అందుబాటులో లేకపోవడం భారతీయ కంపెనీలకు ప్రధాన సవాలుగా మారింది. "చైనాలో భారతీయ ఉత్పత్తులు అనేక రకాల టారిఫ్, నాన్-టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల ఎగుమతులను పెంచడం కష్టంగా మారుతోంది" అని లీ చెప్పారు. "పరస్పర మార్కెట్ కోసం బలమైన ప్రయత్నం లేకుండా సంబంధాల పునరుద్ధరణ కొనసాగితే, రాజకీయ సంబంధాలు మెరుగవుతాయి కానీ చైనా మీద భారత్ ఆర్థికంగా ఆధారపడటం అలాగే ఉండిపోయే ప్రమాదం" అని లీ హెచ్చరించారు.

### పరిష్కారం ఏమిటి?

భారత్ తనకు అనవసరమైన దిగుమతులను తగ్గించడానికి ఎగుమతులు మెరుగు పరచడానికి తయారీ రంగాన్ని బలోపేతం చేయడమే పరిష్కారం అని శ్రీవాస్తవ చెప్పారు. కానీ దానికి నిర్దిష్ట పారిశ్రామిక విధానం, బలమైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్యుత్ సరఫరా, అందుబాటులో రుణాలు, సమర్థవంతమైన రవాణా సౌకర్యాలు, త్వరగా స్పందించే అధికార యంత్రాంగం అవసరం. ఈ విభాగాలలో భారత్ ఇంకా వెనుకబడే ఉంది. ఇటీవల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనలను భారత్ సడలించింది. భారత్‌లో పెట్టుబడులను విస్తరించాలనుకునే చైనా కంపెనీలకు ఈ నిర్ణయం తలుపులు తెరవవచ్చు. కానీ వీటిని కూడా జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని శ్రీవాస్తవ చెప్పారు "పంపిణీ నెట్‌వర్క్‌లను విస్తరించడానికి, చైనా విడిభాగాలను ఉపయోగించి అసెంబుల్ చేయడానికి పెట్టుబడులు పెట్టడం, కేవలం చైనాపై ఆధారపడటాన్నే పెంచుతుంది. అందుకే సాంకేతిక బదిలీ, స్థానికంగా అదనపు విలువను జోడించడం, దేశీయ విడిభాగాల ఉత్పత్తులకు, ఇండియా నుంచి ఎగుమతులకు ప్రాధాన్యంఇవ్వాలి'' అని ఆయన చెప్పారు. భారత్- చైనా మధ్య వాణిజ్య అసమానతను తగ్గించడానికి చైనాకు నిర్దిష్ట రంగాలకు ఎక్కువ అధిక ఎగుమతులు జరపాలనే లక్ష్యంపై భారత్ దృష్టి పెట్టవచ్చని లీ చెప్పారు. చైనా జనాభాలో వృద్ధుల జనాభా పెరుగుతోంది. దీంతో వారి ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరుగుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలు ఎగుమతులు పెంచుకోడానికి సహజంగానే భారత్‌కు కొంత సానుకూలంగా ఉంటాయి. "అయితే కేవలం కొన్ని ప్రత్యేక ఎగుమతి రంగాలను కనుగొనడం ద్వారా112 బిలియన్ డాలర్ల లోటును తగ్గించడం సాధ్యం కాదు" అని లీ చెప్పారు. "సంబంధాలను మరింత విస్తృతం చేయడంలో భాగంగా మార్కెట్ లభ్యతపై రాయితీలు ఇవ్వడానికి బీజింగ్ సిద్ధంగా ఉందా లేదా అన్నదే ఇక్కడ కీలక ప్రశ్న" అని లీ అన్నారు.

# ఫ్లూ నివారణకు చిట్కాలు

ఆయుర్వేదం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడే రసాయన అని పిలువబడే వివిధ రకాల మూలికలను, అలాగే చ్యవన్‌ప్రాష్ వంటి ఫార్ములేషన్‌లను సిఫార్సు చేస్తుంది. శొంఠి, గుడూచి, అశ్వగంధ, యష్టిమధు, పిప్పలి వంటి ఆయుర్వేద మూలికలు రోగనిరోధక శక్తిని పెంచేవిగా ప్రసిద్ధి చెందాయి. కాలానుగుణ ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి, ఈ మూలికలు ప్రతి భారతీయ వంటగదిలో అంతర్భాగంగా ఉంటాయి, వీటిని 'దాదీ-కే-నుస్కే' అని పిలుస్తారు.

హరిద్ర, శుంఠి, యష్టిమధు, పిప్పలి వంటి ఇతర సాధారణ ఆయుర్వేద మూలికలు శోథ నిరోధక, రోగనిరోధక శక్తిని పెంచే మరియు యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి దగ్గు మరియు జలుబు నుండి సమర్థవంతంగా ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. సమర్థవంతమైన ఫలితాలను పొందడానికి ఈ మూలికలను టీ, కషాయాలు, మాత్రలు మొదలైన రూపాల్లో ఉపయోగించవచ్చు.



# నిద్రకు ముందు ఇవి తాగొద్దు

ప్రస్తుత కాలంలో చాలా మందికి నిద్ర కరువవుతుంది. రకరకాల ఒత్తిడులు, ఇతర సమస్యల కారణంగా మానసికంగా ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ ప్రభావం రాత్రి సమయంలో పడి సరైన నిద్ర పోవడం లేదు. అయితే వైద్యులు తెలుపుతున్న ప్రకారం ప్రతిరోజు కనీసం 7 గంటల పాటు నిద్రపోవాలని వైద్యులు తెలుపుతున్నారు. కానీ చాలా మందికి పడుకోగానే నిద్ర రావడం లేదు. ఇలాంటి సమయంలో కొన్ని పానీయాలు తీసుకోవడం వల్ల మంచి నిద్ర వచ్చే అవకాశాలుంటాయి. ఆ పానీయాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..



ప్రతిరోజు మంచి నిద్ర ఉండాలంటే పడుకునే ముందు గోరువెచ్చటి పాలు తాగాలని వైద్యులు తెలుపుతున్నారు. పాలలో ఉండే ట్రిప్టోపాన్ శరీరంలో సెరోటోటిన్ తయారు కావడానికి ఉపయోగపడుతుంది. దీని ద్వారా మెలటోనిన్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది నిద్రకు అనుకూలమైన వాతావరణము కల్పిస్తుంది. ఫలితంగా తొందరగా నిద్రపట్టే అవకాశం ఉంటుంది. అయితే రాత్రి సమయంలో చాలా మందికి పాలు తాగడం అలవాటు ఉండదు. ఇలాంటివారు గోరువెచ్చని నీటిని తాగినా కూడా సరైన ఫలితం ఉంటుందని అంటున్నారు. కానీ కేవలం గోరువెచ్చని నీరు తాగడం వల్ల మంచి నిద్ర వస్తుందన్న గ్యారెంటీ ఇవ్వలేమని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

కెఫిన్ లేని కొన్ని హెర్బల్ టీ తాగడం వల్ల గాఢ నిద్ర వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. దీనివల్ల మనసు ప్రశాంతంగా మారి సరైన నిద్ర వచ్చే అవకాశాలున్నాయి. కానీ కొందరు రాత్రి సమయంలో గ్రీన్ టీ తాగాలని అనుకుంటారు. దీనిని తీసుకోవడం వల్ల నిద్ర సమస్యలు ఎక్కువ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సాధ్యమైనంత వరకు టీ తాగాలని అనుకునేవారుకెఫిన్‌కు దూరంగా ఉండటమే మంచిదని అంటున్నారు.

కేవలం పానీయాలు మాత్రమే కాకుండా తొందరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో ఫ్రైడ్ ఫుడ్ కాకుండా సాత్వికఆహారం తీసుకోవాలని అంటున్నారు. వీటివల్ల తొందరగా జీర్ణమై నిద్రపంగం కలగకుండా ఉంటుంది. అలాగే రాత్రి సమయంలో ఎట్టి పరిస్థితుల్లో కూల్ డ్రింక్ వైపు చూడద్దని చెబుతున్నారు. కూల్ డ్రింక్ తీసుకోవడం వల్ల మానసికంగా ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. శరీరంలోకి ఇవి వెళ్లిన తర్వాత అనేక ఆరోగ్య సమస్యలను ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా వీటిని రాత్రి సమయంలో తీసుకుంటే పదేపదే బాత్రూంలోకి వెళ్లాల్సి వస్తుంది. ఫలితంగా నిద్రపంగం కలిగే అవకాశం ఉంటుంది.

# బబూల్ దాతున్

తుమ్మ పుల్లతో పళ్లు తోముకోవడం వల్ల నోటిలోని హానికర బ్యాక్టీరియా నశించి, నోటి దుర్వాసన సులువుగా తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల సమస్యలను సహజసిద్ధంగా అరికట్టడంలో బబూల్ దాతున్ అద్భుతంగా తోడ్పడుతుంది. పూర్తి వివరాల్లోకి వెళితే...



తుమ్మ చెట్టు తొలవలో ఉండే సహజసిద్ధమైన ఆస్ట్రింజెంట్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోటిలో దుర్వాసన కలిగించే బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. దీంతో రోజంతా నోరు తాజాగా ఉంటుంది. పళ్లపై పేరుకుపోయే ప్లాక్, మలినాలను తొలగించి చిగుళ్లను గట్టిపరచడంలో తుమ్మ పుల్ల సహాయపడుతుంది. చిగుళ్ల నుంచి రక్తం కారడం,వాపులు వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. చిటికెన వేలు మందంలో ఉండే తాజా, శుభ్రమైన తుమ్మ కొమ్మను ఎంచుకోవాలి. పుల్ల చివరి భాగాన్ని దంతాలతో మెల్లగా నమిలి, దారాల్లాంటి పీచు వచ్చేలా బ్రష్‌లా తయారు చేయాలి. ఈ పీచు భాగంతో పళ్లు, చిగుళ్లపై మృదువుగా రుద్దాలి. చిగుళ్లకు గాయం కాకుండా జాగ్రత్త వహించాలి. తోమడం పూర్తయిన తర్వాత శుభ్రమైన నీటితో నోటిని కడుక్కోవాలి.

ఈ విధంగా రోజూ లేదా వారానికి కొన్ని రోజులు బబూల్ దాతున్ వాడటం వల్ల దంతాలు శతాబ్దం పాటు గట్టిగా, ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. అయితే తీవ్రమైన పంటి నొప్పులు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవడం శ్రేయస్కరం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 08.10.2026
www.mudranews.in | @mudranews



**శక్తినిచ్చే పిండిపదార్థాలు :**
తెల్లటి అన్నం, మైదాకు బదులుగా బ్రౌన్ రైస్ (దంపుడు బియ్యం), జొన్నలు, రాగులు, సజ్జలు వంటి తృణధాన్యాలు మరియు ఓట్స్ వంటి పీచుప దార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఎంచుకోవాలి.



# రాహుల్ గాంధీ దూకుడు..

**ముద్ర, డెస్క్:** ఎలాంటి రాహుల్.. ఇపుడు ఎలా కనిపిస్తున్నారు. ఇది కదా జనాల్లో అతి పెద్ద చర్చ. ఒకనాడు పప్పు అని తెగ ట్రోల్స్ చేశారు. ఇపుడు నిప్పుగా మారి చెరిగేస్తున్న తీరుని చూస్తున్న వారు అంతా అవాక్కు అవుతున్నారు. చెలరేగిపోతున్న దూకుడు చూసి షాక్ తింటున్నారు. గాంధీల వంశం అంటే నాయకత్వానికి పెట్టింది పేరు. అలాంటి చోట పప్పు ట్యాగ్ ఎలా సూట్ అవుతుంది. ఎందుకో రాహుల్ గాంధీ రాజకీయాల మీద సరిగ్గా ఫోకస్ పెట్టకపోవడం వల్లనే అలాంటి ట్రోల్స్ చేయడానికి ప్రత్యర్థులకు చాన్స్ వచ్చింది కానీ రాహుల్ గాంధీ లోపల అసలైన మెటీరియల్ అలాగే ఉంది. ఎంతైనా ఆయన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ మనవడు కదా. దేశ తొలి ప్రధాని పండిట్ నెహ్రూకి ముని మనవడు కదా. ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న రాజీవ్ గాంధీకి సిసలైన వారసుడు కదా. అందుకే రాహుల్ గాంధీలోని రాటుతేలిన రాజకీయాన్ని కాలం ముసుగు తీసి చూపిస్తూంటే ప్రత్యర్థులకు నమ్మబుద్ధి కాక దిమ్మ తిరుగుతోంది.

### కర్కశ రాజకీయం నుంచే..

ఎవరైనా ధీటుగా సరిసాటిగా ఎదగాలంటే కాల పరీక్షలను తట్టుకుని నిలవాలి. రాహుల్ గాంధీ విషయంలో ఇపుడు అదే జరుగుతోంది. ఆయన రెండు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయ జీవితంలో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్టేజికి చేరుకున్నారు. తనలోని మాస్ అవతార్ ని ఆయనకు చూపించే చాన్స్ కాలమే ఇచ్చింది. దానితో పాటు ప్రత్యర్థులు కూడా ఇచ్చారు. రాహుల్ ని టార్గెట్ చేసి కార్నర్ చేసి సాగించిన కర్కశ రాజకీయమే ఆయనకు కఠినమైన గుణపాఠాలను నేర్పించింది. వాటి నుంచి నేర్చుకుంటూ రాహుల్ ఈ రోజు అత్యంత బలమైన కూటమి ఎన్డీయేని ఢీ కొట్టేందుకు అంతెత్తున తాను నిలిచి జనానికి కనిపిస్తున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన ర్యాలీలో బారికేళ్ళను దాటుకుని వాటి మీదనే నిలబడి ధీమాగా కనిపించిన రాహుల్ గాంధీని ఈ దేశంలో ప్రతిపక్ష నాయకత్వానికి ఒక శక్తివంతమైన చిహ్నంగా చూడాల్సి ఉంటుంది.



### నిలబడి కలబడి ..

వెన్ను చూపి పరుగు తీయడం ఎప్పుడూ నాయకత్వ లక్షణం కాదు, నిలబడి కలబడితేనే అది రాణిస్తుంది. జనాల నీరాజనాలను అందుకుంటుంది. రాహుల్ గాంధీ రాజప్రసాదాల నుంచి దిగి వచ్చిన మొదట్లో పప్పు అని అంటే అని ఉండొచ్చు. కానీ సగటు మనిషిగా మారి పాదయాత్ర చేసిన చోట, తాను కొలిచిన నేల సమస్తం ఆయనకు అందించిన అవగాహనతో సమగ్రమైన రూపంగా మారిన వేళ ఆయన ఈ దేశానికి ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అవతరించారు. ఇపుడు మరింత దూకుడు చేస్తూ సాగిస్తున్న పోరాటం కొత్త అంకానికి శ్రీకారం చుడుతోంది.

గత రెండేళ్లకు పైగా పాలక పక్షం తీరు మీద అలుపెరగని తీరులో రాహుల్ సాగిస్తున్న పోరాటాన్ని చూస్తున్న వారు అంతా అంటున్న ఒకే మాట రాహుల్ రైట్ ట్రాక్ లోకి వచ్చారు అని. ముల్లుని ముల్లుతోనే కోయాలి. రాజకీయాన్ని రాజకీయంతోనే చెక్ పెట్టాలి. ఈ సూత్రం తెలియడానికి రాహుల్ కి ఎక్కువ సమయం పట్టిందేమో తెలియదు కానీ ఇపుడు మాత్రం ఆయనకు ఒడుపూ విడుపూ అన్నీ అర్థమైపోయాయి. తాను కార్నర్ కావడం కాదు, ఎక్కడ గురి చూసి కొడితే అధికార పక్షం కకా వికలై విలవిలలాడుతుందే నేర్చిన నేర్పరిగా రాహుల్ గాంధీ కరెక్టుగానే టార్గెట్ చేస్తున్నారు. అందులో సక్సెస్ కూడా అవుతున్నారు.

### ఆల్టర్నేషన్ లీడర్ గా..

రాజకీయాల్లో ఎపుడూ శూన్యత ఉండదు, అవకాశాలు ఎన్నో ఉంటాయి. వాటిని వెతుక్కుంటారు నాయకులు. ఇపుడు రాహుల్ గాంధీ చేస్తున్నది అదే. తన పోరాటాన్ని ఏ బారికేడ్లూ నిలువరించలేవు అంటూ వాటిని ఛేదించుకుని నిలువెత్తుగా నిలబడిన రాహుల్ గాంధీలోని డేరింగ్ డైనమిక్ లీడర్ షిప్ ని ఇపుడు దేశమంతా చూస్తోంది. మూడు దఫాలుగా అధికారంలో ఉంటూ యాంటీ ఇంకెంబెన్సీని మూటకట్టుకుంటూ ఆ బరువుతో తానే తగ్గిపోతూ పడుతూ లేస్తూ సాగుతున్న ఎన్డీయే ప్రస్థానానికి సరైన సమయంలో చెక్ పెట్టడానికి ఒక పవర్ ఫుల్ ఆల్టర్నేషన్ గా రాహుల్ గాంధీ ఎమర్జ్ అవుతున్నారు అన్నది అయితే రాజకీయ విశ్లేషణగా ఉంది. రాహుల్ తగ్గకు ఎక్కడా ఆగకు, ఇదే దూకుడుతో ముందుకు సాగాల్సిందే అంటూ జనాల నుంచి వినవస్తున్న నినాదాలు ఆయనలో కొత్త జోష్ నే కలిగిస్తున్నాయి. అందుకే రాహుల్ ఇపుడు ఎక్కడా తగ్గేది లేదంటున్నారు. ఇది అంతం కాదు ఆరంభం అంటూ సాగుతున్న ఆయన జోరుని చూసిన ప్రత్యర్థులు అయితే గుర్రం ఎగరాగలదు అన్న పాత ముతక సామెతను గుర్తు చేసుకోవాల్సి వస్తోంది.

# రష్యాలో ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

### 23 మంది ఇండియన్స్ సురక్షితం..!

**ముద్ర, డెస్క్:** రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య దాదాపు ఐదేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. తాజాగా నల్లసముద్రంలో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. రష్యా రిసార్ట్ నగరమైన సోచి సమీపంలో లైబీరియా జెండా (Liberia flag) తో వెళ్తున్న ఓ భారీ ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి పాల్పడింది. దాంతో ట్యాంకర్‌లో భారీగా మంటలు చెలరేగాయి. దాడి సమయంలో ట్యాంకర్‌లో ఉన్న సిబ్బంది మొత్తం భారతీయులే కావడం గమనార్హం. దాడి జరిగినప్పుడు ఆయిల్ ట్యాంకర్‌లో ఉన్న 23 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా కాపాడినట్లు రష్యా రవాణా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇది భారత అధికారులకు కొంత ఊరట కలిగించే విషయమని తెలిపింది. 'నేవల్ డ్రోన్ల' ద్వారా ఈ దాడి జరిగిందని అధికారులు చెప్పారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది వాటిని అదుపు చేయలేకపోతున్నారని అన్నారు.



ట్యాంకర్ నుంచి ముడిచమురు సముద్రంలోకి వ్యాపించి మండుతోందని, మంటలు కొంచెం తగ్గిన తర్వాత మళ్లీ ఆర్పే ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సోచి నగరం సమీపంలో సముద్రంపై భారీగా నల్లటి పొగ, నారింజ రంగు మంటలు ఎగిసిపడుతున్నట్లు వీడియోల్లో కనిపిస్తున్నది. దాంతో సోచి నగర మేయర్ ముందుజాగ్రత్త చర్యగా తీర ప్రాంతానికి, బీచ్‌లకు ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అయితే నల్లసముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు.2022లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరు దేశాలు వాణిజ్య నౌకలను టార్గెట్ చేస్తున్నాయి.

కాగా రొమేనియా తీరంలో ఓ నౌక మునిగిపోయి ఒకరు మృతి చెందిన ఘటన జరిగిన మరుసటిరోజే ఉక్రెయిన్ ఈ డ్రోన్ దాడికి పాల్పడటం గమనార్హం. ఈ దాడి రష్యానే చేసిందని, అందులోనూ ఒక భారతీయ సిబ్బంది గాయపడ్డారని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు రష్యా కూడా ఇటీవల ఉక్రెయిన్ ధాన్యాన్ని తరలిస్తున్న నౌకలపై దాడులు చేస్తున్నది. తమ నగరాలపై రష్యా చేస్తున్న దాడులకు ప్రతీకారంగానే రష్యా చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని ఉక్రెయిన్ వాదిస్తున్నది. ఇటీవలి వారాల్లో దాడులను తీవ్రతరం చేస్తామని ఇరుపక్షాలు ప్రకటించాయి. గతంలో రష్యాలోని చమురు కేంద్రాలపై జరిగిన ఉక్రెయిన్ దాడులవల్ల సముద్రంలో ఆయిల్ స్లిక్‌లు ఏర్పడటం, బీచ్‌లను మూసివేయడం, ఆకాశం నుంచి విషపూరిత నల్లటి వర్షం కురవడం వంటి పర్యావరణ నష్టాలు సంభవించాయి. ఇప్పటి ఈ ఘటనతో మరోసారి అలాంటి ముప్పు పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఫ్రాన్స్‌ను ఇస్లాం స్వాధీనం చేసుకోవాలనుకుంటోంది

### డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు..!

**ముద్ర, డెస్క్:** ఫ్రాన్స్ లో జరుగుతున్న భారీ విద్యార్థి ఆందోళనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నిరసనలకు అదుపుతప్పిన వలసలే కారణమని, దేశాన్ని (ఫ్రాన్స్) ఇస్లాం తన అధీనంలోకి తీసుకునే ప్రయత్నమే ఇదని ఆరోపించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలను ఫ్రాన్స్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఫ్రాన్స్‌లో జరుగుతున్నది అదుపులేని సామూహిక వలసల ఫలితమే తప్ప మరొకటి కాదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ నిరసనలు పాఠశాలల గురించి కాదని అన్నారు. ఒకప్పుడు గొప్ప దేశంగా ఉన్న ఫ్రాన్స్‌ను ఇస్లాం స్వాధీనం చేసుకోవాలనుకుంటోందని పేర్కొన్నారు. అయితే ఫ్రాన్స్‌లో జరుగుతున్న నిరసనలకు, ట్రంప్ ఆరోపణలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టమవుతున్నది. విద్యావ్యవస్థలో నెలకొన్న లోపాలు, నిధుల కొరత, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలపై ఆందోళనలు జరుగుతున్నాయి.వ ిద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గత సెప్టెంబర్ నుంచి ఆందోళనలు చేస్తున్నారు. ఈ నిరసనల



డిమాండ్లలో వలసలు లేదా మతపరమైన అంశాలు ఎక్కడా లేవు. ఈ క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలపై ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్–నోయెల్ బారో ఘాటుగా స్పందించారు. మన కథను మనమే రాసుకోకపోతే, ఇతరులు మన కోసం రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను ఇతరులు తమకు అనుకూలంగా అన్వయించుకోవడానికి అనుమతించవద్దని ప్రభుత్వంలోని ఉన్నతాధికారులను హెచ్చరించారు.నిన్న జరిగిన నిరసనల్లో దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది పాల్గొన్నారని ప్రభుత్వ వర్గాలు చెప్పగా.. 4.5 లక్షల మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ఇప్పటివరకు 6,100 మందికి పైగా అరెస్ట్ అయ్యారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

## కరెంట్ షాక్‌తో యువ రైతు దుర్మరణం



**ముద్ర, రంగారెడ్డి:** ఫరూఖ్‌నగర్: వరి చేనులో తెగిపడిన విద్యుత్ వైర్లు తగలడంతో ఓ యువ రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండాలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.దేవునిబండ తండాకు చెందిన మూడవత్ బాలు (42) బుధవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లాడు. వరి చేనులోకి నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు ఆయన కాళ్లకు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన బాలు అక్కడికక్కడే మృతి చెందాడు.విద్యుత్ వైర్లు తెగిపడిన విషయాన్ని గుర్తించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



**ముద్ర, చేవెళ్ల:** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేస్తామని తిరుమలాపూర్ గ్రామ సర్పంచ్ మంగమ్మ అన్నారు. షాబాద్ మండలం లోని తిరుమలాపూర్ గ్రామంలో బుధవారం ఆమె లబ్దిదారులకు స్మార్ట్ కార్డులను ఆందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నిరు పెదకు లబ్ది చేకూరు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు రాములమ్మ, మాధవి, మరియమ్మ, రాములు, శ్రీశైలం, సుభాష్ రెడ్డి, అనంత్ రెడ్డి, బంధయ్య , చెన్నయ్య పాల్గొన్నారు.

## ఢిల్లీలో కూలిన బిల్డింగ్..

### శిథిలాల కింద ఐదుగురు..
### కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



**ముద్ర, న్యూఢిల్లీ:** ఢిల్లీలో బిల్డింగ్స్ వరుసగా కూలిన ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా మరో బిల్డింగ్ ఢిల్లీలో కూలిపోయింది. ఈశాన్య ఢిల్లీ, సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం నాలుగంతస్తుల బిల్డింగ్‌కు సంబంధించిన ముందు భాగం కూలిపోయింది. దీంతో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఢిల్లీలోని ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పలు ఫైర్ ఇంజిన్లు, అంబులెన్సులు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఆలోపే స్పందించిన స్థానికులు శిథిలాల కింది నుంచి ఇద్దరు చిన్నారులను బయటకు తీశారు. శిథిలాల కింద ఇంకో ఐదుగురు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. 25 చదరపు గజాల స్థలంలో ఈ బిల్డింగ్ ఉందని, కింద కొన్ని షాపులు ఉన్నాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాలు తొలగిస్తున్నారు. వాటి కింద చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు స్థానికులకు ట్రాఫిక్ సలహా ఇచ్చారు. సీమాపురితోపాటు పరిసర గోల్ చక్కర్, డీఎల్ఎఫ్ భోపురా రోడ్లు కాకుండా కుదిరితే వేరే మార్గాల్లో వెళ్లాల్సిందిగా వాహనదారులకు సూచించారు. ఎందుకంటే ఇక్కడ సహాయక చర్యల కోసం అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే బాధితుల్ని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాల్సి ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వేరే మార్గాల్లో వెళ్లాలన్నారు.

## న్యూట్రినోల అన్వేషణకు 'భౌతిక' నోబెల్

### బెల్జియం శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హల్జెన్‌ను వరించిన ప్రతిష్టాత్మక పురస్కారం

**ముద్ర, డెస్క్:** విశ్వం ఎలా రూపాంతరం చెందిందనే విషయంపై కీలక ఆధారాలు అందిస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్న అరుదైన న్యూట్రినో కణాల రహస్యాలను ఛేదించేందుకు చేసిన కృషికి బెల్జియం శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూట్రినోలు విద్యుత్తు ఆవేశం లేని, అత్యంత స్వల్ప ద్రవ్యరాశి కలిగిన సూక్ష్మమైన కాస్మిక్ కణాలు. అందువల్ల వాటిని గుర్తించడం చాలా కష్టం. విశ్వమంతటా అవి ఉన్నాయి. సూర్యుడి వంటి నక్షత్రాల నుంచి అవి వెలువడుతుంటాయి.



ప్రతి సెకనుకు ట్రిలియన్ల కొద్దీ న్యూట్రినోలు మన శరీరాల గుండా కూడా ప్రయాణిస్తుంటాయి. ఈ రహస్యమైన 'భూత కణాలు' (ఘోస్ట్ పార్టికల్స్) స్వయంగా కనిపించవు. అందువల్ల అవి ఇతర పదార్థ కణాలను ఢీకొన్నప్పుడు జరిగే పరిణామాలను శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు. న్యూట్రినోలు ఇతర కణాలను చాలా అరుదుగా మాత్రమే ఢీకొంటాయి. అందుకే వాటి ఢీకొనడాన్ని గుర్తించే అవకాశాలను పెంచేందుకు శాస్త్రవేత్తలు భారీ డిటెక్టర్లను నిర్మిస్తారు. అంటార్కిటికాలోని విస్తారమైన మంచును ఇలాంటి భారీ డిటెక్టర్‌గా ఉపయోగించాలనే ఆలోచనను హాల్జెన్ ప్రతిపాదించారు.

### ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ ఏర్పాటులో కీలకపాత్ర

అంటార్కిటికాలో నిర్మించిన ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో హాల్జెన్ కీలకంగా వ్యహరించారని నోబెల్ కమిటీ తెలిపింది. ఈ పరిశీలనా కేంద్రం సుదూర గెలాక్సీల నుంచి వచ్చిన అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను తొలిసారిగా గుర్తించింది. 'అంటార్కిటికాలో నిర్వహిస్తున్న ఈ ప్రయోగం మనకు ఇంతకుముందు లేని విధంగా విశ్వాన్ని అర్థం చేసుకునే విప్లవాత్మక మార్గాన్ని అందించింది' అని అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మైఖేల్ మెలోనీ అన్నారు. డిటెక్టర్‌లోని మంచుతో న్యూట్రినో పరస్పరం చర్య జరిపినప్పుడు ఒక చిన్న కాంతి మెరుపు ఏర్పడుతుంది. దీనిని సెన్సర్లు గుర్తిస్తాయి. పారదర్శకమైన మంచు కారణంగా ఈ అత్యంత స్వల్ప కాంతి సంకేతాలను శాస్త్రవేత్తలు సులభంగా గుర్తించగలుగుతారు. కాస్మిక్ కిరణాలు, రేడియేషన్ వంటి అంతరాయాలను తగ్గించేందుకు ఈ సెన్సార్లను సుమారు 8,200 అడుగుల లోతులో మంచులో అమర్చారు. 82 ఏండ్ల హాల్జెన్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్–మ్యాడిసన్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. ఈ వర్సిటీనే ఐస్ క్యూబ్ పరిశీలనా కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. విశ్వం అభివృద్ధి చెందడానికి సంబంధించిన కీలక ఆధారాలను అందించే అరుదైన న్యూట్రినోలపై పరిశోధనలో హాల్జెన్ కీలక పాత్ర పోషించారు.

## అధిక రక్తపోటు తగ్గాలంటే.. వ్యాయామం చేయాలి



రోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. శరీర బరువును అజమాయిషీలో ఉంచుకోవడం ద్వారా బీపీ అదుపులోకి వస్తుంది.

### హరీశ్ రావు విమర్శలు

## వాస్తవాలను కప్పిపుచ్చలేవు

**- యాదాద్రి ప్లాంట్ ఆలస్యానికి గత ప్రభుత్వ తప్పిదాలే కారణం**

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, అక్టోబర్ 7: విద్యుత్ రంగం, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలు వాస్తవాలను కప్పిపుచ్చలేవని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలకు సమాధానం చెప్పకుండా ప్రతిపక్షంలో ఉండి ఇష్టాను సారంగా మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు. యాదాద్రి ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు కేటాయింపులు, సరఫరా లింకేజీలను ముందుగానే నిర్ధారించకుండా నిర్మాణం చేపట్టారని భట్టి ఆరోపించారు. బొగ్గు లభ్యతపై స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయని అన్నారు. జీ–9 బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగా ఉన్నప్పటికీ యాదాద్రికి ఏటా 14 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాకులను సాధించడంలోనూ, అందుబాటులో ఉన్న బొగ్గు బ్లాకులను కాపాడుకోవడంలోనూ వైఫల్యం చెందారని భట్టి విమర్శించారు. యాదాద్రి ప్లాంట్ ఆలస్యానికి పర్యావరణ అనుమతులు, బొగ్గు సరఫరా అంశాల్లో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించడంతో పాటు యాదాద్రి ప్లాంట్ పనులను వేగవంతం చేసిందని చెప్పారు. యూనిట్లను వరుసగా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

### ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించబోతున్నారనే ప్రచారాన్ని భట్టి ఖండించారు. డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠంగా 19,892 మెగావాట్లకు చేరినా ఎలాంటి కోతలు లేకుండా సరఫరా కొనసాగిస్తున్నామని భట్టి చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సంస్థల పనితీరును అభినందించాల్సిందిపోయి తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు.

యాదాద్రి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.6.66గా ఉందని, అధిక విద్యుత్ ఉత్పత్తి వ్యయం వల్ల ఆర్థిక భారం వినియోగదారులపైనే పడుతోందని భట్టి తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌పై గత ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. వారానికి ఒకసారి ఆధారాలతో వాస్తవాలను వెల్లడిస్తామని తెలిపారు. రాజకీయ విమర్శల కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణిపై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని హరీశ్‌రావుకు సూచించారు.

## సీఎం చంద్రబాబును కలిసిన ఆసియా క్రీడల విజేతలు

అమరావతి, అక్టోబర్ 7: 2026 ఆసియా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆసియా క్రీడల విజేతలు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన పతకాలు, వారి అత్యుత్తమ ప్రదర్శనను సీఎం కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై మాతృభూమి పేరును నిలబెట్టిన క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయంగా రాణించాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో క్రీడాకారులు శ్రీ చరణి, గణేష్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. మొత్తంగా 3 రకాల క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలను రాష్ట్ర క్రీడాకారులు కైవసం చేసుకున్నారని సీఎంకు శాప్ ఎండీ భరణి వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## పీఎంపీలు, ఆర్‌ఎంపీల వ్యవస్థను బలోపేతం చేయాలి

**- టీడీ జనార్ధన్**

**ముద్ర, న్యూఢిల్లీ:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో పీఎంపీలు, ఆర్‌ఎంపీలు కీలక పాత్ర పోషిస్తున్నారని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఆల్ ఇండియా బేసిక్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పీఎంపీ–ఆర్‌ఎంపీల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు టీడీ జనార్ధన్ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చిన్నపాటి ఆరోగ్య సమస్యల నుంచి అత్యవసర పరిస్థితుల వరకు తొలుత స్పందించి అవసరమైన సహాయం అందించేది పీఎంపీలు, ఆర్‌ఎంపీలేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పీఎంపీలు, ఆర్‌ఎంపీల వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పనిచేస్తున్న పీఎంపీలు, ఆర్‌ఎంపీల పూర్తి వివరాలను సేకరించి, వారి సామర్థ్యం, అనుభవం ఆధారంగా వర్గీకరించాలని సూచించారు. అనంతరం వారికి అవసరమైన వైద్య పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచేందుకు శిక్షణ, ఇతర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని టీడీ జనార్ధన్ కోరారు. ఇప్పటికే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి పీఎంపీలు, ఆర్‌ఎంపీల సమస్యలు, వారి సేవల ప్రాధాన్యతపై వివరించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా ఉందని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పీఎంపీలు, ఆర్‌ఎంపీల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




# తప్పులుంటే కోర్టులో తేల్చుకోవాలి

**- ఈసీ బీజేపీ జేబు సంస్థ కాదు..**

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



ముద్ర, కరీంనగర్: ఈసీ బీజేపీ జేబు సంస్థ కాదని, ఏవైనా తప్పులుంటే కోర్టులో తేల్చుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. దేశంలో మొట్టమొదట ఓటు, సీటు చోరీకి పాల్పడింది కాంగ్రెస్సేనని అన్నారు. 1946లో దేశంలోని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలన్నీ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్ నెహ్రూను ప్రధానమంత్రిని చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అన్నారు. మోదీకి సొంత కుటుంబం లేదని, దేశ ప్రజలే ఆయన కుటుంబమని చెప్పారు. డబ్బులు, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు మోదీకి అవసరం లేదన్నారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్న తర్వాత కూడా భుజానికి సంచి వేసుకుని సామాన్యుడిలా ప్రజాసేవలో కొనసాగుతారని వ్యాఖ్యానించారు.

### ఈసీపై విమర్శలు సరికాదు

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ సంస్థలను బదనాం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించిన అంశాలపై అభ్యంతరాలు ఉంటే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని కలవవచ్చని, అయితే అపాయింట్‌మెంట్ తీసుకోకుండా వందల మందితో వెళ్లడం సరికాదని అన్నారు. ఎన్నికల సంఘం తప్పు చేసిందని భావిస్తే సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియ లక్ష్యమని బండి సంజయ్ అన్నారు. చనిపోయిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగడాన్ని ప్రశ్నిస్తూ, వాటిని తొలగిస్తే తప్పేమిటని అన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో బోగస్, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని గతంలో కాంగ్రెస్ నేతలే పేర్కొన్నారని ఆయన అన్నారు. తెలంగాణలో దొంగ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు వాటిని తొలగించే ప్రక్రియపై ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు.

కేసీఆర్ భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలను బండి సంజయ్ 'డ్రామా'గా అభివర్ణించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే ధైర్యం బీఆర్ఎస్‌కు లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

### 'పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తిస్తా'

బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు కల్పించిందని బండి సంజయ్ అన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని చెప్పారు. కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో బండి సంజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్‌గా ప్రసంగించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక

**- ప్రమాదాల నివారణే లక్ష్యం.. 'జీరో ఫాటాలిటీ' దిశగా చర్యలు**

**- డీజీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్, అక్టోబర్ 7: తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న 100 జిల్లాలను గుర్తించి చేపడుతున్న కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఏడు జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై డీజీపీ సీవీ ఆనంద్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సేఫ్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, నాలుగు పోలీస్ కమిషనరేట్ల కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, సమయాలు, ప్రమాదాలకు కారణాలు, రహదారి నిర్మాణం, ఇంజినీరింగ్ లోపాలను సమగ్రంగా విశ్లేషించాలని డీజీపీ సూచించారు. ప్రమాదాల వివరాలను మార్గదర్శక్ పోర్టల్, డ్యాష్‌బోర్డులో నమోదు చేసి అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### ఏటా 7 వేలకుపైగా మరణాలు

దేశవ్యాప్తంగా ఏటా సుమారు 1.75 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో ఏటా 7 వేల మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద మరణాల్లో తెలంగాణ దేశంలో ఏడో స్థానంలో ఉందన్నారు. ప్రమాదాల నివారణ కోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయని తెలిపారు.

### 7 జిల్లాల్లో 48 కీలక ప్రమాద కారిడార్లు

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో 48 కీలక ప్రమాద కారిడార్లను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. 2024, 2025 ఈ–డార్ గణాంకాల ఆధారంగా నాలుగు లేదా అంతకంటే ఎక్కువ మరణాలు నమోదైన 230 ప్రాధాన్య–1 ప్రాంతాలు, 220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 183 పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 14 కీలక ప్రమాద కారిడార్లు ఉన్నట్లు కార్యాచరణ ప్రణాళికలో గుర్తించారు. రంగారెడ్డి జిల్లాలో 98 ప్రాధాన్య ప్రమాద ప్రాంతాలు, 99 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 66 పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు.



### '4ఈ' విధానంతో ప్రమాదాల కట్టడి

రోడ్డు ప్రమాదాల నివారణకు '4ఈ' విధానాన్ని అమలు చేయనున్నట్లు సీవీ ఆనంద్ తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే రహదారి లోపాలను గుర్తించి సరిదిద్దడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనల అమలు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ఈ-డార్‌లో ప్రతి ప్రమాదం నమోదు

ప్రతి రోడ్డు ప్రమాదాన్ని ఎలక్ట్రానిక్ డిజిటల్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈ–డార్)లో నమోదు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ప్రమాదాలు, క్షతగాత్రుల వివరాలతో పాటు ప్రమాద స్థలాల జియో ట్యాగ్ ఫొటోలను కూడా మార్గదర్శక్ పోర్టల్ డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ విధానాలను కూడా సమావేశంలో వివరించారు.

### నవంబర్ 3న చెన్నైలో ప్రెజెంటేషన్

నవంబర్ 3న చెన్నైలో జరిగే సమావేశంలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు, మరణాలు అధికంగా నమోదవుతున్న ఏడు జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ సూచించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు ప్రమాదాల సంఖ్యతో పాటు ముఖ్యంగా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు పోలీసు, రవాణా, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీవీ ఆనంద్ ఆదేశించారు.

## పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్: మాజీ మంత్రి జీవన్ రెడ్డి

ముద్ర, జగిత్యాల: రాష్ట్రంలో రేవంత్ రెడ్డికి పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ఆయన తీరు తెలంగాణకు శనిలా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం జగిత్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం "తెలంగాణ భవన్"లో జిల్లా పరిషత్ తొలి ఛైర్‌పర్సన్ దావా వసంత, ఇతర నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని మండిపడ్డారు. కన్నెపల్లి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే కుట్రతోనే నీరందించడం లేదని ఆరోపించారు. పొట్ట దశలో ఉన్న వరి పంటను రక్షించేందుకు ఎస్సారెస్పీ నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేకపోతే 'క్రాప్ హాలిడే' ప్రకటించి ఎకరాకు రూ. 20,000 నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



అలాగే కేసీఆర్ జీవితం తెరిచిన పుస్తకమని, ఆయన ఆస్తులన్నీ 2009 ఎన్నికల అఫిడవిట్ నుండి స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. మూడేళ్లుగా కాళేశ్వరం, కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్న రేవంత్ రెడ్డి, కనీసం 3 రూపాయల అవినీతైనా రుజువు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అదేవిధంగా శాంతి భద్రతల దృష్ట్యా బీఆర్ఎస్ నాయకులపై భౌతిక దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, అధికార పక్షానికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆయిల్నేని వెంకటేశ్వరరావు, వోళ్ళం మల్లేశం, అల్లాల ఆనందరావు, శీలం ప్రవీణ్ కుమార్, కళ్లేపల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో విగ్రహం మాయం

**ముద్ర, జగిత్యాల:** బంగారు పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహంతో పాటు పలు వస్తువులు మాయమైన ఘటన బుధవారం జరిగింది. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని కొత్తపేట సమీపంలో ఉన్న బంగారు పోచమ్మ ఆలయం సుమారు 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగింది. ఈ ఆలయంలో మంగళవారం రాత్రి విగ్రహంతో పాటు రెండు గంగిరెద్దుల మట్టి విగ్రహాలు, నైవేద్య కుండలు, విగ్రహం కింద ఉన్న పెద్ద రాయి కనిపించకుండా పోయాయి. ప్రతిరోజూ ఆలయాన్ని శుభ్రం చేసే ఓ భక్తుడు ఉదయం ఆలయానికి వచ్చి చూడగా ఈ విషయం తెలిసింది. ఆలయంలోని విగ్రహాలు, వస్తువులు మాయమవడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు, పోలీసులు దర్యాప్తు చేపట్టి విగ్రహం మాయమైన ఘటనకు గల కారణాలను వెలికి తీయాలని స్థానికులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

గురువారం 08.10.2026

www.mudranews.in | @mudranews



**కండరాల పుష్టికి ప్రొటీన్లు :**

శరీర ఎదుగుదలకు, కండరాల బలానికి ప్రొటీన్లు అవసరం. పప్పుధాన్యాలు, శనగలు, బఠానీలు, పాలు, పెరుగు, పన్నీర్, కోడిగుడ్లు మరియు చికెన్, చేపల ద్వారా మంచి ప్రొటీన్లు లభిస్తాయి.



# ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

**బతుకమ్మలతో మహిళల ర్యాలీ..**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా కేంద్రం భువనగిరిలో మహిళా సమాఖ్య, ప్రజా నాట్యమండలి కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం రోజున జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ముందుగా సిపిఐ జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభకు ★తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ చుట్టూ ఆడిపాడడంతో కార్యక్రమం పండుగ వాతావరణాన్ని సంతరించుకుందన్నారు. ప్రభుత్వాలు బతుకమ్మ ఆటపాటలు, కప్పకాముడు, సంస్కృతి కళారూపాలు అంతరించిపోకుండా కావాల్సిన నిధులు కేటాయించి ప్రోత్సహించి సాంస్కృతిక కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషపాక నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్ నాయకులు ఇంజా హేమలత, సామల శోభన్ బాబు, పుట్ట రమేష్, మాటూరి జానమ్మ, యానాల సంధ్య, మంచాల రాధమ్మ, సుగుణ, కట్ల యాదగిరి, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, బోడ సోమనర్సయ్య, జాను, అండాలు, సరిత, పుష్ప, విజయ, సంధ్య, మల్లమ్మ శ్రీదేవి, కవిత, వాణి, లావణ్య పాల్గొన్నారు.



# ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకు నాయకత్వం వహించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలోని విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రధాన పాత్ర పోషించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల ఒక రోజు సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్.ఎల్.ఎన్.లో ప్రగతి సాధించడానికి ప్రతి పాఠశాలలో వారానికి ఒక గంట సేపు రీడింగ్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. మండలాలు మరియు కాంప్లెక్స్ ల వారీగా సమీక్ష చేసి, వివిధ విషయాలలో వెనుకబడి ఉన్న ప్రధానోపాధ్యాయులను కారణాలు అడిగి తెలుసుకుని, తిరిగి జరిపే సమీక్షా సమావేశంలో ప్రగతి మెరుగు చూపించాలని ఆదేశించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులో,ఇతర విద్యా విషయాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేయాలని కోరారు.జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి మాట్లాడుతూ. ఎఫ్.ఎల్.ఎన్, ఎ.ఎక్స్.ఎల్, మధ్యాహ్న భోజనం,నోటు పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు,ప్రతిభా గ్రేడ్ ఇండెక్స్,అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్,పూర్వ ప్రాథమిక విద్య,ఎఫ్.ఆర్.ఎస్,ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, యు.డైస్ డ్రాప్ బాక్స్ ,ఆధార్, అపార్,టాయిలెట్స్,విద్యుత్తు,త్రాగు నీరు,సమగ్ర శిక్ష,పి.ఎం.శ్రీ సివిల్ పనులు మరియు నిధుల ఖర్చు, ఏకరూప దుస్తులు, బూట్లు, బెల్టులు, ఎస్.హెచ్.వి.ఆర్,ప్రశస్త మరియు ఓపెన్ స్కూల్ లో ప్రవేశాలు, పదవ తరగతి పరీక్షల ప్రణాళిక మొదలైన అంశాల మీద సమగ్ర సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సీ.హెచ్.శ్రీనివాస్, జిల్లా కామన్ పరీక్షల బోర్డు అధికారి పాండు, ప్రభుత్వ పరీక్షల విభాగం అదనపు కార్యదర్శి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారులు అండాలు,శ్రీహరి అయ్యంగార్, పెసరు లింగారెడ్డి,జానీ ఆఫ్టన్, ఎం.నరహరి,జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్,స్కౌట్స్ అధికారి కే.కే.శ్రీధర్,పాఠ్య పుస్తకాల సహ శాఖాధికారి బి.రమేష్, ఎఫ్.ఎల్. ఎన్.రాష్ట్ర బాధ్యులు కావ్య, చందన,మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్ళు,కేజీబీవీ ఎస్. ఓ.లు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే పునాది

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**ముద్ర, యాదగిరిగుట్ట:** విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసి, వారిని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించే గురువులకు సమాజంలో అత్యున్నత స్థానం ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను బాధ్యతగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు అందించే విద్యాబుద్ధులు వారిని భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.బుధవారం యాదగిరిగుట్టలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆచార్య దేవోభవ' కార్యక్రమానికి బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి 'ఆచార్య దేవోభవ' పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలే తనను ఎమ్మెల్యే స్థాయికి తీసుకొచ్చాయని గుర్తుచేశారు. ఉపాధ్యాయ వృత్తిలో స్వార్థానికి తావు ఉండదని, సొంత పిల్లల కంటే ఎక్కువగా పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తారని కొనియాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్ది సమాజానికి వెలుగునిచ్చేలా చేసేది గురువులేనన్నారు.ఒక విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు తల్లిదండ్రుల కంటే ఎక్కువగా సంతోషించేది గురువులేనని పేర్కొన్నారు. వైద్యులకు పేరు ముందు 'డాక్టర్ (Dr.)' అనే గుర్తింపు ఉన్నట్లుగానే ఉపాధ్యాయులకు కూడా 'టీచర్ (Tr.)' అనే హోదా కల్పించే విధానాన్ని కర్ణాటకలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఇదే తరహా గౌరవాన్ని తెలంగాణ ఉపాధ్యాయులకు కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అమలు కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువత చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమానికి ట్రస్మా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రావు, రాష్ట్ర సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు బండి రాజుల శంకర్, దానపరెడ్డి, అచ్చయ్యగౌడ్, ఐలేని రాంరెడ్డి, కృష్ణంరాజు, సయ్యద్, మరియన్న, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.స్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించేది లేదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.

**ఆర్టీసి ఎన్నికల ప్రచారంలో..**

శుక్రవారం జరగనున్న ఆర్టీసి కార్మిక సంఘం ఎన్నికలలో ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలోని ప్రయాణ ప్రాంగణంతో పాటు కార్మికులు విధులు నిర్వహిస్తున్న గ్యారేజ్ ప్రాంతాన్ని సందర్శించి ఆర్టీసీ కార్మికులను కలిసి మాట్లాడారు. వారి సమస్యలు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సంస్థ అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐఎన్టియుసి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు వీఎస్ రావు యొక్క 'బాణం' గుర్తుకు, మొగుళ్ల రాజిరెడ్డి యొక్క 'నక్షత్రం' గుర్తుకు ఓటు వేసి ఘన విజయం అందించాలని కార్మికులను కోరారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ఆర్టీసీ సంస్థను మరింత బలోపేతం చేయడంలో కార్మికుల పాత్ర కీలకమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.అనంతరం బస్టాండులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై పలువురు మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తమకు కలుగుతున్న ప్రయోజనాలు, ఆర్టీసీ సేవలు, బస్సుల రాకపోకలు, ప్రయాణ సౌకర్యాలపై ప్రయాణికులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, ఐఎన్టియుసి నాయకులు పాల్గొన్నారు.




# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి**

**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కార్మికుల సమావేశం పేరబోయిన స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి హక్కులు, సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్మికులకు వారానికి ఒకరోజు సెలవు, క్యాజువల్ లీవ్స్, పండుగ మరియు జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కార్మికుల శ్రమకు తగిన వేతనం కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా మున్సిపల్ సేవల్లో పనిచేస్తున్న కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన సెలవులు, వేతనాలు, ఇతర హక్కులను అమలు చేయాలని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్మికుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ మేనేజర్ సుమిత్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి పేరబోయిన బంగారు, ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, గీతా పనివారల సంఘం మండల కార్యదర్శి గుండు వెంకటేష్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు గడిపే జహంగీర్, గ్యాదపాక స్వామి, గోపి, జయమ్మ, కొన్నె అయిలమ్మ, సూదగాని అయ్యం, గ్యాదపాక హరిబాబు, కలమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.




## పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 7 :** ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి విక్రయించే రైతులు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పత్తిలో తేమ 8 శాతం లోపు ఉండేలా ఆరబెట్టి తీసుకురావాలని, జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్ల ద్వారా తేమ శాతాన్ని ముందే పరీక్షించుకునే వెసులుబాటు ఉందన్నారు. 8 శాతానికి మించి తేమ ఉంటే ప్రతి ఒక్క శాతానికి రూ.86.67 చొప్పున కోత ఉంటుందని తెలిపారు. కౌలు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. విక్రయ సమయంలో ఆధార్ బయోమెట్రిక్, ఐరిస్ లేదా మొబైల్ ఓటిపి ద్వారా ధృవీకరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులు 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని, పత్తి విక్రయ వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం వాట్సాప్ హెల్ప్‌లైన్ 8897281111, టోల్‌ఫ్రీ నంబర్ 18005995779 ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

## బిజెపి నూతన మోర్చా అధ్యక్షుల నియామకం



**ముద్ర, యాదగిరిగుట్ట:** భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలపరిచేందుకు గానూ యాదగిరిగుట్ట పట్టణంలో పార్టీకి పలువురు నూతన మోర్చా అధ్యక్షులను పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ కుమార్ బుధవారం ప్రకటించారు.ఈ సందర్భంగా కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై పోరాడేందుకు క్రియాశీలకంగా పని చేసే నాయకులకు ఈ కమిటీలో ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలుగా ఆరుట్ల స్వాతి, ఓబిసి మోర్చా అధ్యక్షుడిగా శివరాత్రి శ్రీశైలం, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా రుద్రాక్ష నవీన్ లను నియామించినట్లు తెలిపారు.

## పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 7:** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి కుటుంబంలో పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి, సకాలంలో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సీడీపీఓ సుబ్బలక్ష్మి , కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య మిషన్ కింద 99 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 7 :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ విభాగంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీ లో 99 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఈ నియామక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 8 నుండి 13వ తేదీ వరకు కార్యాలయ పనివేళల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిగా నింపిన ఫారమ్‌తో పాటు సంబంధిత విద్యార్హతలు, కుల, స్థానికత, ఇతర అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు. సమర్పించాల్సిన దరఖాస్తులను కలెక్టరేట్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో గల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.వివిధ పోస్టుల వివరాలు, విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక నిబంధనలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ https://khammam.telangana.gov.in ను సందర్శించాలని కోరారు.

## భువనగిరిలో వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బీజేపీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ అధ్యక్షతన స్థానిక జగ్జీవన్ రామ్ గారి విగ్రహం వద్ద సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ మాట్లాడుతూ మోడీ పథకాలు పేర్లు కాదు, దేశంలోని సామాన్యుడి జీవితాన్ని మార్చాలనే ఒక ఆలోచనా విధానమని అన్నారు.మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి, ఈ రోజు వరకు ఆయన రాజకీయ ప్రస్థానం దాదాపు 25 సంవత్సరాల చరిత్ర.ఈ 25 సంవత్సరాల్లో ఆయన కేవలం పదవులను అనుభవించలేదన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ప్రయాణం...2014లో భారత ప్రధానమంత్రి స్థాయికి చేరిందని 2019లో ప్రజలు మరోసారి ఆయనకు బలమైన మద్దతు,2024లో దేశ ప్రజలు మద్దతు ఇచ్చి మూడోసారి నరేంద్ర మోదీ ని ప్రధానమంత్రిగా చూడాలని నిర్ణయించారు. భారతదేశం ఇతరులపై ఆధారపడే దేశంగా కాకుండా...తన సామర్థ్యంపై నిలబడే దేశంగా ఎదగాలి అనేది మోడీ ఉద్దేశం అని అన్నారు. "వికసిత్ భారత్ 2047" లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ కార్యకర్తలుగా మన బాధ్యత ఏమిటి?కేవలం ఎన్నికల సమయంలో జెండా పట్టుకోవడం కాదు.ప్రజల మధ్య ఉండాలి.ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, తుమ్మల మురళీధర్ రెడ్డి, మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పుల యాదిరెడ్డి, చందా మహేందర్ గుప్తా, కాదురాచ్చయ్య, కార్యదర్శులు కామిటికారి కృష్ణ, వైజయంతి, మేడి కోటేష్, జిల్లా మీడియా కన్వీనర్ ఆకుతోట రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శి మంగు నరసింహారావు, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమార్, వంగేటి సుచరిత, స్వర్ణలత, యాస్మిన్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి చంద్ర, సీనియర్ నాయకులు దాసరి మల్లేశం, పడమటి జగన్మోహన్ రెడ్డి, సుర్వి శ్రీనివాస్, సుదగాని ఉదయ్, రాళ్ల బండి కృష్ణ చారి, వివిధ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 08.10.2026
www.mudranews.in | @mudranews



**విటమిన్లు మరియు ఖనిజ లవణాలు**

రోగనిరోధక శక్తిని పెంచడానికి ఇవి తోడ్పడతాయి. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు (తోటకూర, పాలకూర), తాజా కూరగాయలు మరియు రంగురంగుల పండ్లను (జామ, జామకాయ, నారింజ, అరటి) చేర్చుకోవాలి.



# మట్టి వాసన నుంచి బిగ్ బాస్ వరకు..

## స్ఫూర్తిదాయక రైతుబిడ్డ 'ఝాన్సీ ముదిరాజ్'



**ముద్ర, సూర్యాపేట:** తు చేతికర్ర పట్టిన ఆ చేతులే మైకు పట్టి జానపద గీతాలు ఆలపిస్తుంటే పల్లె మురిసిపోతోంది. పొలంలో దిగి దుక్కి దున్నిన ఆ అడుగులే ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద రియాలిటీ షో 'బిగ్ బాస్' వేదికపై అడుగుపెడుతుండటంతో తెలంగాణ పల్లె సీమ గర్విస్తోంది. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, కష్టాలను ఎదురించి, చదువులో ప్రతిభ చాటుకుని, జానపద గీతాలతో సోషల్ మీడియాలో గుర్తింపు తెచ్చుకుని బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టిన గుండెబోయిన ఝాన్సీ ముదిరాజ్ ప్రయాణం నేటితరానికి స్ఫూర్తిదాయకం.కష్టాల్లో రూపుదిద్దుకున్న పట్టుదలసూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన సైదులు, హేమలత దంపతుల కుమార్తె ఝాన్సీ. ముగ్గురు అక్కచెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్న ఈ కుటుంబానికి వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. తండ్రి సైదులు కేబుల్ ఆపరేటర్‌గా, మున్సిపాలిటీ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు.తొమ్మిదో తరగతి వయసు నుంచే తండ్రికి తోడుగా పొలం పనుల్లోకి దిగిన ఝాన్సీ.. నాగలి పట్టి పొలం దున్నడం నుంచి వరి కోతల వరకు వ్యవసాయ పనుల్లో ఆరితేరింది. తండ్రి అనారోగ్యానికి గురైన క్లిష్ట సమయంలోనూ అధైర్యపడకుండా తమ్ముడితో కలిసి కుటుంబ వ్యవసాయ బాధ్యతలను భుజాన వేసుకుంది.పార పట్టిన చేతితోనే పుస్తకం పట్టి.. ఎం.ఎస్సీ టాపర్!ఒకవైపు వ్యవసాయ పనులు చేస్తూనే మరోవైపు చదువులోనూ తన ప్రతిభను చాటుకుంది. కష్టాలు ఎదురైనా చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ఇంటర్మీడియట్‌లో 926 మార్కులు సాధించింది. అనంతరం ఉన్నత విద్యపై దృష్టి సారించి ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎం.ఎస్సీ పూర్తి చేసి పీజీ పట్టా అందుకుంది.వ్యవసాయ పనులు చేస్తూనే సైన్స్‌లో పీజీ పూర్తి చేయడం ఆమె పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది.మట్టి వాసనల 'మాస్' గాత్రంచిన్ననాటి నుంచే ఝాన్సీకి సంగీతమంటే ఎంతో ఇష్టం. మూడో తరగతి చదువుతున్నప్పుడే 'ఆడపిల్ల నమ్మ నేను ఆడపిల్లని' పాటతో తొలిసారి వేదికపై పాట పాడి ప్రశంసలు అందుకుంది. ఎలాంటి ప్రత్యేక సంగీత శిక్షణ లేకపోయినా పల్లె వాతావరణం నుంచి వచ్చిన సహజ స్వరంతో జానపద గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.'రామ్‌రెడ్డి దొర', 'అడ్డా బాటలకాడ నల్ల సారంగులయ్య', 'నాజూకు పిల్లోడు' వంటి పాటలతో పాటు బతుకమ్మ పాటలు కూడా సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందాయి. తెలంగాణ పల్లె జీవితం, మట్టి వాసనను ప్రతిబింబించే జానపద గీతాలను తనదైన శైలిలో ఆలపిస్తూ అభిమానులను సంపాదించుకుంది.ఆమె ప్రతిభను గుర్తించిన తమ్ముడు.. ఝాన్సీ పొలం పనులు చేస్తున్నప్పుడు, పాటలు పాడుతున్నప్పుడు వీడియోలు తీసి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్ట్ చేస్తూ ప్రోత్సహించాడు. ఈ క్రమంలో ఆమెకు సోషల్ మీడియాలో భారీగా అభిమానులు ఏర్పడ్డారు.కామనర్ నుంచి 'బిగ్ బాస్' వేదిక వరకు..సామాన్యుల కోసం నిర్వహించిన 'అగ్నిపరీక్ష సీజన్-2'లో 15 మంది కంటెస్టెంట్లతో పోటీపడి తన ప్రతిభతో విజేతగా నిలిచిన ఝాన్సీ.. తద్వారా బిగ్ బాస్ తెలుగు-10 హౌస్‌లోకి నేరుగా ప్రవేశించే అవకాశం దక్కించుకుంది.బిగ్ బాస్ వేదికపైకి వెళ్లే ముందు ఆమె చెప్పిన మాటలు కూడా తన పట్టుదలను ప్రతిబింబించాయి. పొలంలో మందు చల్లేటప్పుడు ఎంత అలసిపోయినా తండ్రి బాధపడతారని ఆగకుండా పనిచేసినట్లే, బిగ్ బాస్ హౌస్‌లోనూ ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోనని ఆమె ఆత్మవిశ్వాసంతో పేర్కొంది.పల్లె నుంచి రాష్ట్ర వేదిక వరకు..సాధారణ పల్లెటూరి రైతుబిడ్డగా ప్రయాణం ప్రారంభించిన ఝాన్సీ ముదిరాజ్.. వ్యవసాయ పనులు చేస్తూనే ఉన్నత విద్యను పూర్తి చేసి, జానపద గాయనిగా గుర్తింపు తెచ్చుకుని, సోషల్ మీడియాలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇప్పుడు బిగ్ బాస్ వేదికపైకి అడుగుపెట్టడం ద్వారా తన ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకుంది.మట్టి వాసనను మరచిపోకుండా.. కష్టాలను మెట్లుగా మార్చుకుంటూ ముందుకు సాగుతున్న ఝాన్సీ ప్రయాణం పల్లె యువతకు, ముఖ్యంగా గ్రామీణ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# అత్యాశే సైబర్ నేరగాడి ప్రధాన ఆయుధం

### ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆదేశాల మేరకు అక్టోబర్ 2026 నెలను నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచనల మేరకు మెదక్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై విస్తృత అవగాహన, సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. గుర్తుతెలియని కాల్స్, మెసేజ్‌లు, లింకులు, అనుమానాస్పద ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు. పార్ట్‌టైమ్ జాబ్, లోన్ యాప్, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడులు, అధికారుల పేరుతో జరిగే ఇంపర్సనేషన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, ఏటిఎం పిన్, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడంతో పాటు https://cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెలంతా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్, ఆర్ఐ శైలందర్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఏడేళ్ల శిక్షమైనర్ బాలికను ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు నీలం కుమార్ (30)కు ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. శంకరంపేట (ఆర్) పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన 16 ఏళ్ల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిని నిందితుడు ప్రేమిస్తున్నానని, ఎలాగైనా పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అనంతరం బాలికను సంగారెడ్డిలోని తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి శంకరంపేట (ఆర్) ఎస్ఐ గౌస్ ఏప్రిల్ 2021లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ శ్రీధర్‌గౌడ్, లీగల్ అడ్వైజర్ శ్వేత సహకరించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షరాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతను మెరుగుపరచడం, జీరో ఫాటాలిటీ లక్ష్య సాధనపై రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇళంబరిది పాల్గొని రోడ్డు ప్రమాదాల పరిస్థితి, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై సమీక్షించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

# తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి
### పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ముద్ర, శేరిలింగంపల్లి:** నియోజకవర్గంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారంతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో జలమండలి ఈడీ సంతోష్‌రెడ్డి, జీఎంలు కృష్ణ, హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, పనితీరుపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కాలనీల వాసుల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించడంతో పాటు ప్రజలకు అధికారులు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని సూచించారు.ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛమైన, కలుషితం కాని తాగునీటిని అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని గాంధీ సూచించారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో యూజీడీ పైప్‌లైన్లు, తాగునీటి పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన పనులు చేపట్టాలని సూచించారు.ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిపై సమీక్షించిన ఆయన.. అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు.మురుగునీరు పొంగిపొర్లకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని గాంధీ అన్నారు. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అవసరమైన చోట పాత పైప్‌లైన్లను మార్చడంతో పాటు కొత్తగా యూజీడీ పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అత్యవసర పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.సమావేశంలో జలమండలి డీజీఎంలు నారాయణ, శ్రీనివాస్‌రాజు, నరేందర్, శ్రీహరి, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 4 తులాల పుస్తెలతాడు స్నాచర్ అరెస్ట్

### సొత్తు రికవరీ, బైక్ సీజ్
### వివరాలు వెల్లడించిన డిఎస్పీ ప్రసన్న కుమార్



**ముద్ర ప్రతినిధి మెదక్:** మెదక్ పట్టణంలో మహిళ మెడలోని సుమారు 4 తులాల బంగారు పుస్తెలతాడు స్నాచింగ్ నిందితుడిని పట్టుకుని బంగారం రికవరీ చేశారు. దొంగను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. టౌన్ పిఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పీ ప్రసన్న కుమార్ వివరాలు వెల్లడించారు. ఈనెల 5న ఉ. సుమారు 11:30 గంటలకు మెదక్ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్ సమీపంలో వృద్ధ మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి లాకెళ్ళాడు. 75 ఏళ్ల ఇప్ప పోచమ్మ తన పెన్షన్ డబ్బులు డ్రా చేసుకోవడానికి ఇంటి నుండి బ్యాంకుకు వెళ్తుండగా, బ్యాంకు సమీపంలోకి చేరుకున్న సమయంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెనుక నుండి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని, పరారయ్యాడు. ఎస్పీ ఆదేశాల మేరకు, మెదక్ డీఎస్పీ పర్యవేక్షణలో, మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహేష్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, టౌన్ ఎస్ఐ నారాయణ దర్యాప్తు బాధ్యతలు చేపట్టారు. కానిస్టేబుళ్ళు మల్లేశం, నర్సింలు,నిఖిల్ రెడ్డి, ప్రశాంత్, సల్మాన్, దస్తయ్య, చిట్టిబాబు, ప్రశాంత్, టెక్నికల్ టీమ్‌లను సమన్వయం చేస్తూ కేసును ఛేదించారు.స్నాచింగ్ జరిగిన వెంటనే ముత్తాయికోటకు చెందిన శివ శంకర్ నిందితుడిని వెంబడిస్తూ సుమారు 15 కిలోమీటర్ల మేరకు ఛేజ్ చేసి, నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో పోలీసు బృందాలకు కీలకంగా సహకరించారు. ఆయన సమయస్ఫూర్తితో చేసిన ప్రయత్నం కేసు ఛేదనలో ముఖ్యమైన పాత్ర పోషించింది. శివ శంకర్ అందించిన సహకారంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని బుధవారం రామాయంపేటలో పట్టుకున్నారు. కాట్రియాల్ గ్రామానికి చెందిన మడ్డి వీరేశంగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, స్నాచింగ్‌కు గురైన పూర్తి సొత్తును రికవరీ చేశారు. రికవరీ చేసిన సొత్తులో సుమారు 4 తులాల బంగారు పుస్తెలతాడు, మొబైల్ ఫోన్, బైక్ సీజ్ చేశారు. కేసును ఛేదించి పూర్తి సొత్తును రికవరీ చేయడంలో కృషి చేసిన, సిబ్బంది, నిందితుడిని సుమారు 15 కిలోమీటర్లు వెంబడించి పోలీసులకు కీలకంగా సహకరించిన శివ శంకర్ అభినందించారు. 500 నగదు, శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఎస్ఐ నారాయణ ఉన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణలో కౌన్సిలర్ల పాత్ర కీలకం

### డీఎంహెచ్ఓ డా.ఆర్.బి.గణేశ్వర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** హెచ్.ఐ.వి / ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ఐ.సి.టి.సి.సి. కౌన్సిలర్ల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.బి. గణేశ్వర్ తెలిపారు. బుధవారం సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రజల్లో ముఖ్యంగా యువతీ యువకులలో వ్యాధిపట్ల అవగాహన కల్పించాలని, విద్యార్థుల లైఫ్ స్టైల్ ఆరోగ్యకరంగా వుండాలని, మత్తు మాదక ద్రవ్యాలకు,చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా వుండాలని, హెచ్.ఐ.వి. / ఎయిడ్స్ బారిన పడ్డ వారిని సానుభూతితో అర్థం చేసుకోవాలని, మంచి ఆహారం, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను క్రమం తప్పకుండా వాడాలని, ప్రభుత్వం పెన్షన్ కూడా ఇస్తుందని, రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ తో వున్నవారు మంచి జీవన విధానాన్ని అలవాటు చేసుకొని, పాజిటివ్ దృక్పథంతో వుండి పెళ్లి కూడా చేసుకోవచ్చని,ముందస్తు జాగ్రత్తలతో తమకు పుట్టబోయే పిల్లలకు హెచ్.ఐ.వి. రాకుండా పూర్తిగా కాపాడవచ్చని, జిల్లాలో హెచ్.ఐ.వి. ఇతర ఆర్.టి.ఐ. వ్యాధుల ఇన్ఫెక్షన్ ను తగ్గించాలని, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ లో జాబ్ చేస్తున్న ప్రతి ఒక్కరు ఎన్.జివో.లు, ఇతర సామాజిక సంస్థలతో కలిసి ప్రజల్లో నిరంతరం అవగాహన శిబిరాలను కొనసాగించాలని, ప్రతి ఒక్కరికి హెచ్.ఐ.వి. టెస్టులు నిర్వహించాలని, జిల్లాను హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ రహిత జిల్లాగా చేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.బి. గణేశ్వర్ తెలిపారు. జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిప్రసాద్, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కో ఆర్డినేటర్, కౌన్సిలర్లు, ఐ.సి.టి.సి.సి. కౌన్సిలర్లు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎన్.జి.వో. ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ తీర్మానం

### కూకట్‌పల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**ముద్ర, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం సూచనలను పాటిస్తూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎన్ ఎస్‌యూఐ పాటు వివిధ విభాగాల ప్రతినిధులు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... తనకు మద్దతు తెలిపేందుకు తరలివచ్చిన కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరి సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మహిళా, యూత్ కాంగ్రెస్, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555